

ఆధార్ మార్పు, చేర్పులకు అధికంగా వసూలు చేస్తే చర్యలు

కొత్తచెరువు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఆధార్ కేంద్రాల్లో చేర్పులు, మార్పుల కోసం వచ్చే ప్రజల నుంచి అధికంగా డబ్బు వసూలు చేస్తే చర్యలు తప్పవని డీఎల్‌డీఓ సుధాకర్‌రెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. మీసేవ కేంద్రాలు, సచివాలయాలు, బ్యాంకులు, పోస్టాఫీసుల్లో ఆధార్ కేంద్రాలున్నాయనీ, అక్కడ ప్రభుత్వం నిర్ణయించిన ధరలు కాకుండా అధికంగా వసూలు చేస్తే కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూంకి 7981528287 నంబరులో ఫిర్యాదు చేయవచ్చన్నారు.

ఈ భవంతి చూశారా.. గత వైసీపీ పాలనలో కబ్జాలపర్వానికి పరాకాష్ట. జిల్లా కేంద్రం పుట్టపర్తి నడిబొడ్డున ఎనుములపల్లి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన నిర్మిస్తున్నారు. వాగుపై కడుతున్నారు. నీటిపారుదల శాఖకు చెందిన రూ.5 కోట్ల విలువైన స్థలాన్ని ఓ వైసీపీ నాయకుడు కబ్జా చేశాడు. పక్కన సర్వే నంబరులో ఉన్న భూమిలో అనుమతులు తీసుకుని, నీటిపారుదల శాఖ స్థలంలో నిర్మాణం చేపడుతున్నాడు. విచిత్రమేమిటంటే ఇది జిల్లాకేంద్రంలోని మూలనున్న రహదారి కాదు. ఈ దారి గుండానే ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్లాలి. ఆ అధికారులు రోజూ ఈ నిర్మాణాన్ని చూస్తూనే వెళ్తుంటారు. నీటిపారుదల శాఖ భూమిలో నిబంధనలు ఉల్లంఘించి కడుతున్నా కన్నెత్తి చూడరు. చూసీచూడనట్లు వెళ్లిపోతుండడం విమర్శలకు తావిస్తోంది.




వాగును మింగిన వైసీపీ నాయకుడు

పుట్టపర్తిలో రూ.5 కోట్ల ఇరిగేషన్ భూమి కబ్జా

యథేచ్ఛగా బిల్డింగ్ నిర్మాణం

చోద్యంచూస్తున్న అధికారులు



AP Land Records

Adangal Report

జిల్లా: Sri Sathya Sai - శ్రీ సత్యసాయి | మండలం: Sri Sathya Sai - శ్రీ సత్యసాయి | గ్రామం: YENUMALAPALLE (RURAL) - ఎనుములపల్లి | Survey No.: 15

1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14	15
1	15	0.64	0.64	0.0	వాగు	0.0	unknown	unknown	0.0	20001202	వాగు (వాగు)	వాగు (వాగు)	0.64	unknown

The information contained made available through "http://meebhoomi.ap.gov.in/" web site is for information only and cannot be utilised as certified / authenticated copy for producing in any court or for enforcing any legal claims etc.under the existing relevant Acts / Rules framed by the Government of Andhra Pradesh in this context. This is not an Official App of AP Govt.

ఇరిగేషన్ భూమికి సంబంధించిన అడంగళ్

పుట్టపర్తిటౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కనగల ఇరిగేషన్ స్థలాన్ని ఓ వైసీపీ నాయకుడు దర్జాగా కబ్జా చేశాడు. ఎనుములపల్లి రెవెన్యూ పంచాయతీ పరిధిలోని సర్వే నంబరు 15లో 64 సెంట్ల స్థలం ఉంది. ప్రధాన రహదారి పక్కన ఉండటం, ఆర్డీఓ, తహసీల్దార్, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు సమీపంలోనే ఉండటంతో ఈ స్థలం ధర ప్రస్తుతం రూ.10 కోట్లుపైగా పలుకుతోంది. దీంతో ఈ స్థలంపై ఓ వైసీపీ నాయకుడి కన్నుపడింది. గత వైసీపీ హయాంలో నియోజకవర్గానికి చెందిన ముఖ్య ప్రజాప్రతినిధి అండతో 30 సెంట్ల వరకు దర్జాగా కబ్జా చేశాడు. ఏకంగా షాపింగ్, రెసిడెన్షియల్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నాడు. అహుండా, మున్సిపల్ అనుమతులు కూడా లేకుండానే జీప్లస్ 3 భవంతి కడుతున్నాడు. అధికారులు నిత్యం తిరిగే ప్రధాన రహదారి పక్కనే ఇంతస్థాయిలో అక్రమ నిర్మాణం చేపడుతున్నా.. పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.



అనుమతి ఒకచోట.. నిర్మాణం మరోచోట..

ఎనుములపల్లి రెవెన్యూ గ్రామ పరిధి 16-1 సర్వే నంబరులోని 6.5 సెంట్ల స్థలంలో జీప్లస్ 2 భవన నిర్మాణానికి గతేడాది ఏప్రిల్ 11న నగర పంచాయతీ అనుమతి తీసుకున్నట్లు తెలుస్తోంది. నిర్మాణం మాత్రం పక్కన సర్వే నంబరు 15లో చేపడుతున్నారు. అది కూడా.. జీప్లస్ 3 భవనం నిర్మిస్తున్నారు.

ఓ రెవెన్యూ అధికారి అండతో..



పుట్టపర్తి తహసీల్దార్ కార్యాలయంలో ఏళ్ల తరబడి ఓ రెవెన్యూ అధికారి పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఆయన అండదండలతో కబ్జాదారులు రెచ్చిపోతున్నట్లు సమాచారం. ఆ రెవెన్యూ అధికారి మండలంలో ప్రభుత్వ భూములు, ఖాళీ స్థలాలు ఎక్కడెక్కడున్నాయో తెలుసుకుని, వాటికి నకిలీ రికార్డులు సృష్టిస్తూ కబ్జాదారులకు సహకరిస్తుడన్న ఆరోపణలు ఆ శాఖ వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. తద్వారా ఆ అధికారి కోట్లాది రూపాయలు వెనకేసుకున్నాడన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చినా వైసీపీ నాయకుల కబ్జాల పర్వం మాత్రం ఆగట్లేదు. కొంతమంది అధికారుల సహకారంతో దర్జాగా ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తున్నట్లు తెలుస్తోంది.

రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాం

ఎనుములపల్లి రెవెన్యూ పొలంలో ప్రధాన రహదారి పక్కన సర్వే నంబరు 15లో 64 సెంట్ల ఇరిగేషన్ స్థలం ఉన్నది వాస్తవమే. ఆ స్థలం కబ్జా అయిందనీ, సర్వే చేసి హద్దులు చూపించాలని పుట్టపర్తి తహసీల్దార్‌కు పలుమార్లు అర్జీలు ఇచ్చినా స్పందించలేదు. విషయాన్ని ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

- సుధాకర్‌రాజు, జేఈ, ఇరిగేషన్

విచారించి, చర్యలు తీసుకుంటాం

ఎనుములపల్లి రెవెన్యూ పొలంలోని సర్వే నంబరు 15లో ఇరిగేషన్ స్థలాన్ని ఆక్రమించి, భవంతి నిర్మిస్తున్నట్లు నా దృష్టికి రాలేదు. విచారించి, అక్రమమని తేలితే చట్టపరమైన చర్యలు తీసుకంటాం.

-సువర్ణ, ఆర్డీఓ, పుట్టపర్తి

తల్లీబిడ్డలను కాపాడుకుందాం

జిల్లా వైద్యాధికారి మంజువాణి



సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి మంజువాణి

పుట్టపర్తిరూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సమష్టిగా పనిచేసి తల్లీబిడ్డను కాపాడుకుందామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ మంజువాణి.. వైద్యాధికారులకు సూచించారు. స్థానిక జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో మాతాశిశు మరణాల నివారణపై జిల్లాస్థాయి సమీక్ష నిర్వహించారు. జిల్లాలో వివిధ ఆస్పత్రుల్లో సంభవించిన మాతాశిశుమరణాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే ప్రతి గర్భిణిని పరీక్షించి, సూచనలు ఇవ్వాలన్నారు. లోపాలను సరిదిద్దుకుని, సమష్టిగా పనిచేస్తే తల్లీబిడ్డను కాపాడుకోవచ్చన్నారు. ప్రతినెలా 9వ తేదీన ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కింద గర్భవతులకు గ్రూపు సమావేశం నిర్వహించి, వారికి ఆరోగ్యవిద్య బోధించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపవైద్యాధికారి సెల్వియాసాల్మన్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగేంద్రనాయక్, వైద్యులు శశిరేఖ, క్రాంతి, డీపీహెచ్ఎన్ఓ వీరమ్మ, పీహెచ్‌సీల వైద్యాధికారులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

కలెక్టర్ చేతన్ ఆదేశాలు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి టౌన్ (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ టీఎస్ చేతన్.. అధికారులను ఆదేశించారు. సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై గురువారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్ అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, పలు సూచనలు ఇచ్చారు. అనంతరం కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ.. జిల్లాలో 214 సూక్ష్మ, 16 మధ్యతరహా నీటిపారుదల ప్రాజెక్టులున్నాయన్నారు. వాటి పరిధిలోని 230 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. డిసెంబరు 5న నోటిఫికేషన్, 8న ఎన్నికలు ఉంటాయన్నారు. 14న మధ్యతరహా ప్రాజెక్టులకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. అందుకు ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత శాఖాధికారులను అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో విజయసారథి, ఇరిగేషన్ డీఈ గంగాధర్, జేఈ జమునాబాయి పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన అవసరం: ఎస్పీ



కుణుతూరులో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

ధర్మవరంరూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ఎస్పీ రత్న పేర్కొన్నారు. మండలంలోని కుణుతూరు గ్రామ ఎస్సీ కాలనీలో గురువారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజల మధ్య అసమానతలు తొలిగినపుడే సామాజిక వివక్ష తొలగిపోతుందన్నారు. నిరాక్షరాస్యత, పేదరికంతో వెనుకబడిన ప్రజలకు పౌరహక్కుల రక్షణ గురించి అవగాహన కల్పించాలన్నారు. రాజ్యాంగం ప్రసాదించిన హక్కులపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. పౌరహక్కుల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ ప్రభాకర్, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నీరు..!



తాగునీటి మాటున నయాదందా

నయా నీటిదందా తెరపైకి వచ్చింది. ప్లాస్టిక్ నీటిని యథేచ్ఛగా అమ్ముతున్నారు. వినియోగించిన ఖాళీ బాటిళ్లను తీసుకుని, అందులో నీరు నింపి యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. వాటిపై లేబుల్ తదితర వివరాలేవీ ఉండవు. ఆ బాటిల్‌ను సరిగా శుభ్రం చేశారో, లేదో కూడా తెలీదు. అందులో నింపిన నీరు శుద్ధి చేశారా, లేదా అన్నది కూడా ప్రశ్నార్థకమే. అలా నీరు అమ్ముతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. దీనిని అరికట్టాల్సిన అధికారులు పట్టించుకున్న పాపానపోలేదు.



ఖాళీ బాటిళ్లలో నీరు నింపిన దృశ్యం

ఖాళీ బాటిళ్లలో నీరు నింపి విక్రయాలు

నీటి స్వచ్ఛత ప్రశ్నార్థకం

తనిఖీలు మరచిన అధికారులు

ప్రజారోగ్యంతో చెలగాటం

పుట్టపర్తి, నవంబరు28(ఆంధ్రజ్యోతి): శుద్ధ జలం పేరుతో నీటి వ్యాపారం అడ్డదారులు తొక్కుతూ జనాలను రోగాల బారిన పడేస్తోంది. తాజాగా జిల్లాలో మరో ప్లాస్టిక్ బాటిల్ నింపుడు నీటి వ్యాపారం మొదలైంది. ఐఎస్ఐ గుర్తింపు ఉన్న బ్రాండెడ్ తాగునీటి ప్లాస్టిక్ బాటిళ్ల కన్నా సగం ధరకే విక్రయిస్తున్నారు. దీంతో ఆ నీటిని జనం తాగేసి, రోగాలను కొనితెచ్చుకుంటున్నారు. ఇలా జిల్లాలో శుద్ధజల ప్లాంట్లతో మొదలుకుని దుకాణాల్లో ప్లాస్టిక్ బాటిళ్లలో నీరు నింపి, విక్రయాలు సాగిస్తున్నారు. జిల్లాలో నీరు కొని, ప్లాస్టిక్ తాగి, రోగాలు కొనితెచ్చుకుంటున్న పరిస్థితులున్నాయి. ఇటీవల జిల్లాలో శుద్ధజల ప్లాంట్లు పట్టణ, గ్రామీణ స్థాయికి పాకి విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. వాటిలో కొన్నింటికే ఐఎస్ఐ గుర్తింపు ఉండగా.. వేలసంఖ్యలో శుద్ధజలం పేరుతో ట్రాక్టర్లు, ట్యాంకులతో పాటు చిన్న వాహనాల్లో మైకులు పెట్టి వ్యాపారం మొదలుపెట్టారు. శుద్ధజల ప్లాంట్లలో తాగునీటి నాణ్యత పరీక్షలు లేకుండానే వ్యాపారం సాగుతోంది. కళ్లెదుటే శుద్ధజలం, ప్లాస్టిక్ బాటిళ్లలో వ్యాపారం యథేచ్ఛగా సాగుతున్నా ఆహార భద్రత తనిఖీ శాఖాధికారులు అటువైపే చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

తాగేనీరు స్వచ్ఛమేనా?

జిల్లాలో ఇటీవల వరదలు, భారీ వర్షాలతో వాగులు, వంకలు, నదులు ఏకమై ప్రవహించాయి. ఈక్రమంలో చాలాచోట్ల జలాలు కలుషితమయ్యాయి. అనేక రకాల జంతు జీవరాశులు కొట్టుకొచ్చాయి. విషపదార్థాలు, చెత్తాచెదారంతో కూడిన నీరు లభించే పరిస్థితి నెలకొంది. ఈనేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ప్రజలు తాగేనీరు సురక్షితమా.. కాదా.. ప్రజల ఆరోగ్యాన్ని కబళించే బురద ఇతర కలుషిత నీళ్లు ఏమైనా వస్తున్నాయా అని పరీక్షలు చేపట్టాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉంది. నీటిశుద్ధి ప్లాంట్ల నుంచి వాటర్ బాటిళ్లు విక్రయించే దుకాణాల దాకా నీటి సమూనాలు సేకరించి, వాటిని ప్రయోగ శాలలకు తీసుకెళ్లి ఆ నీరు తాగేందుకు అనువైనవేనా, హానికరమైన బ్యాక్టీరియా ఇతర క్రిములేమైనా ఉన్నాయా అని పరీక్షలు చేయించాలి. నీటిలో క్లోరిన్, బురద ఇతర హానికర మలినాలు, రసాయనాలు, ఫ్లోరైడ్ శాతం నిర్దేశిత పరిమాణాలకు లోబడి ఉందా, లేదా అనేది పరీక్షించి, నివేదికలతో తాగునీటి విక్రయాలపై నిఘా పెట్టాలి. అనుమానం వస్తే బ్యాక్టీరియా లాజికల్ (కల్చర్ టెస్ట్) కూడా చేయాలి. రోజూ జిల్లాలో శుద్ధజలం పేరుతో నీటి వ్యాపారం చేస్తున్న ప్లాంట్లలో నమూనాలు సేకరించి, పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపాలి. ఈప్రక్రియ జిల్లాలో నామమాత్రంగా సాగుతోందన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. జిల్లాలో నీటి పరీక్షల కోసం శుద్ధజల ప్లాంట్ల నుంచి నమూనాలు సేకరించే నాథుడే కన్పించడంలేదు. ఈనేపథ్యంలో పేద, మధ్యతరగతి ప్రజలు శుద్ధజల ప్లాంట్ల నుంచి నీరు కొంటున్నా అనారోగ్యం బారిన పడుతుండడం గమనార్హం.

ప్లాస్టిక్ బాటిళ్ల నింపుడు దందా

జిల్లాలో ఇటీవల ప్లాస్టిక్ బాటిళ్లలో నీటిని నింపి, విక్రయించి ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. ఒక్కో ప్లాస్టిక్ లీటర్ బాటిల్‌ను రూ.4కి కొనుగోలు చేసి, అందులో నీరు నింపి, రూ.10 నుంచి రూ.15దాకా విక్రయిస్తున్నారు. శుద్ధజల ప్లాంట్ల నుంచి దుకాణాల దాకా ప్లాస్టిక్ బాటిళ్లలో నీటిని నింపుడు విక్రయాలు జిల్లావ్యాప్తంగా జోరుగా సాగుతున్నాయి. ఖాళీ ప్లాస్టిక్ బాటిళ్లు సరఫరా చేసే ఏజెన్సీలు వెలుస్తున్నాయంటే ఈ దందా ఏ స్థాయిలో సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. జిల్లా కేంద్రం పుట్టపర్తిలో ఎటుచూసినా ప్లాస్టిక్ బాటిళ్లలో నీరు నింపి, విక్రయిస్తున్నారు. ఆ నీరు తాగితే ప్లాస్టిక్ శరీరంలో అణువుణువూ చేరిపోయి, అనారోగ్యాన్ని తెచ్చిపెడుతుంది. ఫలితంగా క్యాన్సర్ వంటి భయానక వ్యాధులు బారిన పడతారని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. కలుషిత నీటితో కలరా, టైఫాయిట్, వైరల్, హెపటైటీస్-ఎ, థైరాయిడ్, కొన్నిరకాల చర్మవాధులు సోకే అవకాశం ఉందని వారు చెబుతున్నారు.

ప్లాస్టిక్ బాటిళ్లలో నీటిని నింపి అమ్మితే చర్యలు తప్పవ్

ప్లాస్టిక్ బాటిళ్లలో నీటిని నింపి విక్రయిస్తేవారిపై కేసులు నమోదు చేస్తాం. ఇటీవల తనిఖీల్లో ఈ విషయాన్ని గుర్తించాం. అలాంటి వారిని మరోమారు ఇలా చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించాం. శుద్ధజల ప్లాంట్లలో నీటి నమూనాలు సేకరించి, ల్యాబ్‌కు పంపుతున్నాం. జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేపడుతున్నాం.

- రామచంద్ర, ఆహార భద్రత శాఖ జిల్లా అధికారి

గంజాయి జోలికెళ్తే మటాషే..!

సరఫరాదారులపై పోలీసుల డేగకన్ను

కేసులతోపాటు ఆస్తుల జప్తుకు సన్నాహాలు

ఆధార్, రేషన్‌కార్డు స్వాధీనానికి సిద్ధం

1 నుంచి మహాసంకల్పం పేరుతో అవగాహన సదస్సులు

7లో



మృత్యువులోనూ కలిసే..




ప్రమాద స్థలంలో దాదు, పవన్‌కుమార్ మృతదేహాలు

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన బైక్..

ఇద్దరు స్నేహితుల దుర్మరణం

(వివరాలు 7లో...)

రేపు అనంతకు సీఎం చంద్రబాబు



నేమకల్లులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ.. గ్రామ ప్రజలతో సమావేశం.. అర్జీల స్వీకరణ (వివరాలు 6లో...)

దహనం


సూర్యనగర్‌లో...

చలి వణికిస్తోంది..!
ఎవరికి ముద్దు..?
ముద్ద చేతికి అందాలంటే..
కాలం ఏదైనా కష్టపడాల్సిందే..
పొద్దు పొడవకనే
వేటకు వెళ్లాల్సిందే..!

రోడ్డుపై చెత్త..
కడుపులో పేగులు..
రెండింటికీ మంటలు..!
భిన్నమైన చలిమంటలు..!


కలెక్టరేట్ వద్ద..

(అనంతలో గురువారం వేకువ జామున..)


రుద్రంపేటలో...

న్యూస్‌బాక్స్

ఇంటర్ ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

అనంతపురం విద్య/కొత్తచెరువు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షల ఫీజు చెల్లింపు గడువు వచ్చే నెల 5వ తేదీ వరకూ పొడిగించినట్లు అనంత, శ్రీసత్యసాయి జిల్లా ఆర్‌ఐఓలు వెంకటరమణ నాయక్, రఘునాథరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఈ విషయాన్ని విద్యార్థులకు తెలియజేయాలని సూచించారు. మళ్లీ గడువు పొడిగించే అవకాశం ఉండదని, విద్యార్థులను అప్రమత్తం చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచడానికి సంకల్ప్-2025 కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. డిసెంబరు 1 నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకు ఈ కార్యక్రమం అమలు చేస్తామని తెలిపారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు సాయంత్రం 4 గంటల నుంచి 5గంటల వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తామని తెలిపారు. యూనిట్ టెస్టులను డిసెంబరు 2 నుంచి 4వతేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు.

8న ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

అనంతపురం విద్య, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపకార వేతన (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షలు డిసెంబరు 8వ తేదీ నిర్వహించనున్నట్లు డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ గోవింద్ నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతాయన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కార్యాలయ వెబ్‌సైట్ www.bse.ap.go v.in నుంచి స్కూల్ లాగిన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. సంబంధిత స్కూల్ ప్రధానోపాధ్యాయులు పాఠశాల యూ-డైస్ కోడ్‌ను ఉపయోగించి లాగిన్ అయ్యి తమ స్కూల్ విద్యార్థుల హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు అందజేయాలన్నారు. మరిన్ని వివరాల కోసం కమలానగర్‌లోని పాత డీఈఓ కార్యాలయంలోని పరీక్షల విభాగం అధికారులను సంప్రదించాలని సూచించారు.

1న హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు డిసెంబరు 1వతేదీన కళ్యాణదుర్గంలోని కరణం చిక్కప్ప ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సాకే శివశంకర్ గురువారం ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు జనన ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు, క్రీడాసామగ్రి, యూనిఫాంతో హాజరుకావాలన్నారు. ఎంపికైనవారు డిసెంబరు రెండో వారంలో నిర్వహించే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. వివరాలకు 8978137522, 7013572439 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

శబరిమలకు ప్రత్యేక రైలు

గుంతకల్లు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని గుంతకల్లు మీదుగా శబరిమలకు ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మౌలాలి-కొల్లాం (నం. 07141) ప్రత్యేక రైలు డిసెంబరు 7వ తేదీ మధ్యాహ్నం 2-45 గంటలకు మౌలాలీ స్టేషన్‌లో బయలుదేరి మరుసటిరోజు రాత్రి పదిన్నరకు కొల్లాంకు చేరుతుందని తెలిపారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07142) కొల్లాంలో డిసెంబరు 9వ తేదీ తెల్లవారుజాము రెండున్నరకు బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం ఒంటి గంటలకు మౌలాలీ స్టేషన్‌కు చేరుతుందని తెలియజేశారు. ఈ రైలు సికింద్రాబాద్, బేగంపేట, లింగంపల్లి, వికారాబాద్, తాండూరు, సేరం, యాద్గిర్, క్రిష్ణా, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్లు, గుత్తి, ఎర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పట్టి, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, కోయంబత్తూరు, పొదనూరు, పలక్కడ్, త్రిసూర్, అలువ, ఎర్నాకులం టౌన్, కొట్టాయం, చెంగనచేరి, తిరువల్ల, చెంగనూరు, కళ్యాణీకులం స్టేషన్ల మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు.

ఎంపీఈఓలకు పోస్టింగ్‌లు ఖరారు

అనంతపురం అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): చిత్తూరులో ఓడీపై పనిచేసి తిరిగి జిల్లాకు వచ్చిన 48 మంది ఎంపీఈఓలకు వ్యవసాయ శాఖలో పోస్టింగ్‌లు ఇచ్చారు. వారు ఇచ్చిన ఆప్షన్ల మేరకు స్థానాలను ఖరారు చేశారు. జేడీఏ ఉమామహేశ్వరమ్మ గురువారం పోస్టింగ్‌లు ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కేటాయించిన స్థానాల్లో తక్షణమే చేరాలని ఆదేశించారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది క్రమబద్ధీకరణ ప్రక్రియను ప్రభుత్వం త్వరలో చేపట్టబోతోంది. ఇదివరకే మండలాల వారిగా పంటల సాగు విస్తీర్ణం, ఎంత మంది సిబ్బంది కావాలన్న వివరాలను వ్యవసాయ శాఖ కమిషనరేట్‌కు పంపారు. ఒక్కో ఉద్యోగికి 1100 ఎకరాల నుంచి 3 వేల ఎకరాల విస్తీర్ణం అప్పగిస్తారని సమాచారం. పలు మండలాల్లో అదనంగా ఉన్న సిబ్బందిని క్రమబద్ధీకరణలో అవసరమున్న ప్రాంతాలకు పంపనున్నారు. తద్వారా ఈ-పంట నమోదు, ఇతర పనులు త్వరగా చేసేందుకు అవకాశం ఉంటుంది.

ముంపు నియంత్రణ..!

వరదనీటికి అడ్డుకట్ట వేసేలా చర్యలు

- పండమేరు, తడకలేరు, నడిమివంక ప్రవాహంపై దృష్టి
- పరివాహక ప్రాంతాల్లో 688 పనుల గుర్తింపు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వర్షం నీరు నగరంలోకి ప్రవేశించకుండా, పక్కకు మళ్లించేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇటీవల కురిసిన భారీ వర్షాల కు వరదబారిన పడిన కాలనీల దుస్థితిని సవాల్‌గా తీసుకున్న జిల్లా యంత్రాంగం ఈ ప్రణాళిక లకు శ్రీకారం చుట్టింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఈ పనులు చేయాలని నిర్ణయించారు. పండమేరు, నడిమివంక, తడక లేరు, మరువవంకలలో వరదనీరు అధికమై నగరంలోకి ప్రవేశించి సమీప కాలనీలు ముంపునకు గురవుతున్నాయి. వరదనీటికి అడ్డుకట్టవేసేందుకు అనంతపురం రూరల్, ఆత్మకూరు, బుక్కరాయసముద్రం, రాప్తా డు మండలాల్లో మొత్తం 688పనులను గుర్తించారు. ఆయా మండలాల్లో పడే వర్షం నీరు అక్కడే భూమిలోకి ఇంకేట్లుచేయడం ఒకటి. అలాగే నీటిని నదులలోకి, చెరువులలోకి మళ్లించడంపై మార్గాలను అన్వేషించా రు. ఉపాధి, వాటర్ షెడ్ పథకాల ద్వారా కాలువలు, కుంటల తవ్వకం, పూడికతీత పనులు చేపట్టాలని నిర్ణయించారు. డ్వామా, భూగర్భజల శాఖ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖ, అగ్రికల్చర్ శాఖలను సమన్వ యంతో పనులు చేయాలని ప్రభుత్వం సూచించింది. ఇందుకు డ్వామాను నోడల్ శాఖగా గుర్తించారు. పనులు చేపట్టేందుకు అంచనా వ్యయ ప్రతిపాదనలు సిద్ధం చేసే పనిలో వారు నిమగ్నమయ్యారు.


పండమేరు వంక

నాలుగు వంకలతోనే వరద ముప్పు

నగరంలోకి ప్రధానంగా నాలుగు వంకలతోనే వరద ముప్పు వాటిల్లు తోంది. పండమేరు కనగానపల్లి ప్రాంతంలో ప్రారంభమై సుమారు 63 కిలోమీటర్లు ప్రవహించి బుక్కరాయసముద్రం చెరువులో కలుస్తుంది. తడకలేరు కూడేరు మండలంలో ప్రారంభమై 28కిలోమీటర్ల మేర ప్రవహించి సోమలదొడ్డి వద్ద చెరువులో కలుస్తుంది. నడిమివంక కాలవ ఆత్మకూరు మండలం ననపవద్ద ప్రారంభమై సుమారు 38కిలోమీటర్లు ప్రవహించి సోమలదొడ్డి వద్ద తడకలేరులోకి కలుస్తుంది. ఇక మరువవంక నగరంలోని పాతూరులో చెరువుకట్ట కింద ప్రారంభమై ఆరు కిలోమీటర్లు ప్రవహించి సోములదొడ్డి వద్ద తడకలేరు వాగులోకి కలుస్తుంది. ఈ నాలుగు వాగుల పరివాహక ప్రాంతాల పైభాగంలో వాననీటి సంరక్షణ పనులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టారు.

నాలుగు మండలాల్లో పనులు

నగరంలోకి వచ్చే వరదనీటికి అడ్డుకట్ట వేసేందుకు అనంతపురం రూరల్, ఆత్మకూరు, రాప్తాడు, బుక్కరాయసముద్రం మండలాల్లో పను లు చేపడుతారు. ఆయా మండలాల్లో ఫారంపాండ్స్, డగవుట్‌పాండ్స్, బౌండరీట్రెంచ్‌లు, క్యాటింగ్ పాండ్స్ నిర్మాణం చేపట్టను న్నారు. అదే విధంగా కుంటలు, వాగులు, వంకలు, చెక్‌డ్యాంల్లో పూడికతీత పనులు చేపట్టి అధికనీటి నిల్వకు చర్యలు చేపట్టనున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే 688పనులను గుర్తించారు. రూరల్ మండల పరిధిలో నడిమివంక, పండమేరు, తడకలేరు వాగులలో 163పనులు చేపట్టనున్నారు. ఆత్మకూరు మండలం లోని నడిమివంక, తడకలేరు వాగులలో 173, బుక్కరాయసముద్రం మండలంలోని తడక లేరులో 26, రాప్తాడు మండలంలోని నడిమివంక, పండమేరు వాగులలో 326పనులు గుర్తించారు. మొత్తంగా నడిమివంక పరిధిలో 141పనులు, పండమేరు పరిధిలో 307, తడకలేరు వాగులో 240పనులు గుర్తించారు.

అంచనాలు తయారు చేసే పనిలో ఉన్నాం

- సలీంబాషా, డ్వామా పీడీ

ప్రధానంగా నగరంలోకి ప్రవేశించే వరద నీటి కాలనీలు ముంపున కు గురిగాకుండా రక్షించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. ఉపాధి నిధుల ద్వారా చేపట్టే 688పనులు గుర్తించాం. పనులకు సంబంధించి అంచనాలు తయారు చేసే పనిలో ఉన్నాం. వారం రోజుల్లో పనుల అంచనాలు తయారు చేసి కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపుతాం. ఆమోదం తెలిపిన వెంటనే గుర్తించిన పనులను చేపడుతాం. నిర్ణీత గడువు విధించి సకాలంలో పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు. సంబంధిత శాఖలను సమన్వయం చేసుకుని వెళతాం.

ఉల్లి రైతుకు కన్నీరు


అబ్బేదొడ్డిలో తుఫాన్‌తో దెబ్బ తిన్న ఉల్లి పంట

- తుఫాన్ల దెబ్బకి కుళ్లిన పంట
- పెట్టుబడి కూడా రాని దుస్థితి
- కుమిలిపోతున్న అన్నదాతలు

గుత్తిరూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉల్లిపంట రైతులకు కంటనీరు తెప్పిస్తోంది. గత రెండు నెలల క్రితం మండలంలోని చాలా గ్రామాల్లో రైతులు ఉల్లిని సాగు చేయగా.. ఇటీవల తుఫాన్ల దెబ్బకి పంటంతా కుళ్లిపోయింది. దీంతో పెట్టుబడి కూడా చేతికందే పరిస్థితి లేకపోవడంతో రైతులు కంటనీరు పెడుతున్నారు. ముఖ్యంగా కొత్తపేట, కరిడికొండ, పెద్దొడి, పూలకుంట, రజాపురం, శ్రీపురం, చెర్లోపల్లి, బసినేపల్లి తండా తదితర గ్రామాల్లో బోరుబావులున్న రైతులు ఉల్లి పంటను సాగు చేశారు. ఇందుకు ఎకరాకు రూ.85 వేల నుంచి రూ. 95 వేల వరకు పెట్టుబడి పెట్టారు. బాగా పండితే ఎకరాకు 80 నుంచి 90 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం ఉల్లి ధర కూడా క్వింటా రూ.5 వేలు పలుకుతోంది. రూ. 2వేలకు పైగా పలికినా రైతుల పెట్టుబడులు పోను ఎకరాకు రూ.70 వేల నుంచి రూ. 80వేల వరకు ఆదాయం వస్తుంది. దీంతో అన్నీ బాగున్నాయనుకుని రైతులు ఎన్నో ఆశలతో ఉల్లి పంట సాగు చేశారు. అయితే తుఫాన్ వారి ఆశల్ని అడియాసలు చేసింది. పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు మొదలయ్యాయి. సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో తుఫాన్లు ఎడతెరపి లేకుండా వచ్చాయి. వాటి దెబ్బకి తేమ శాతం అధికమై ఉల్లి పంట పొలాల్లోనే కుళ్లిపోయింది. దీంతో దిగుబడి కూడా చేతికి వచ్చే పరిస్థితి లేకపోవడంతో రైతులు కుమిలిపోతున్నారు. చేసేదిలేక రైతులు అకరొకగా పండిన పంటను సైతం పొలాల్లోనే వదిలేశారు.

తుఫాన్ దెబ్బకు పంట కుళ్లిపోయింది

- సుధాకర్, రైతు, కొత్తపేట



రెండు ఎకరాలో ఉల్లి పంటను సాగు చేశాను. ఉల్లికి కొంత మేర ధర ఉండేది. అందుకోసం సెప్టెంబరు మాసంలో ఉల్లి సాగు చేశాను. తుఫాన్ దెబ్బకి పంట చాలావరకు కుళ్లిపోయింది. దీంతో దిగుబడి వస్తుందో లేదో దిక్కు తోచని పరిస్థితి నెలకొంది. భారీ పెట్టుబడి పెట్టాను. ప్రస్తుతం ఉల్లి పంట చిన్న చిన్న గడ్డలతో ఉంది.


పొలంలోనే వదిలేసిన ఉల్లి పంట

పంటను దున్నేశా:

గోవిందునాయక్, రైతు, బసినేపల్లి తండా



నేను ఎకరాలో బోరుబావుల కింద ఉల్లి పంటను సాగు చేశాను. ఎంతో కష్టపడి పెట్టుబడి పెట్టాను. సెప్టెంబరు మాసంలో తుఫాన్ దెబ్బకి పొలంలోనే పంట కుళ్లి పోయింది. వాటిని దున్నేశాను. రూ.40 వేల వరకు నష్టపోయాను. తర్వాత వాటిలోనే మళ్లీ ఉల్లి పంటను సాగు చేశాను.

రేపు జిల్లాకు సీఎం చంద్రబాబు

నేమకల్లులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

గ్రామ ప్రజలతో సమావేశం.. అర్జీల స్వీకరణ

అనంతపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శనివారం జిల్లాకు వస్తున్నారు. ఒకరోజు పర్యటనలో భాగంగా బొమ్మనహాల్ మండలం నేమకల్లు ఇందిరమ్మ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేస్తారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత స్వయంగా ముఖ్యమంత్రి పింఛన్ల పంపిణీలో భాగస్వాములవుతున్నారు. రచ్చబండ తరహాలో నేమకల్లు గ్రామ ప్రజలతో ముఖ్యమంత్రి సమావేశమౌతారు.

సీఎం పర్యటన షెడ్యూల్

- శనివారం ఉదయం 11 గంటలకు: తాడేపల్లిలోని నివాసం నుంచి రోడ్డు మార్గాన విజయవాడ విమానాశ్రాయానికి బయలుదేరుతారు.
- 11.40: విజయవాడ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి విమానంలో బయలుదేరి మధ్యాహ్నం 12.25 గంటలకు బెంగళూరు విమానాశ్రాయానికి చేరుకుంటారు.
- 12.45: బెంగళూరు విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో నేమకల్లు హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 12.45 గంటల నుంచి 12.50 గంటల వరకూ ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారు.
- 12.50 గంటల నుంచి 1.20 గంటల వరకూ విశ్రాంతి తీసుకుంటారు.
- 1.20 గంటలకు హెలిప్యాడ్ నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 1.25 గంటలకు నేమకల్లు ఇందిరమ్మ కాలనీకి చేరుకుంటారు.
- 1.25 గంటల నుంచి 1.55 గంటల వరకూ ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు.
- 1.55 గంటల నుంచి 2.00 గంటల వరకూ నేమకల్లులోని ఆంజనేయస్వామిని దర్శించుకుంటారు. ఆ తరువాత 3.05 గంటల వరకూ స్థానిక ప్రజలతో సమావేశమవుతారు.
- మధ్యాహ్నం 3.10 గంటలకు నేమకల్లు హెలిప్యాడ్‌కు చేరుకొని 3.15 గంటల వరకూ ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారు.
- 3.45 గంటలకు హెలిక్యాప్టర్‌లో బెంగళూరుకు బయలుదేరుతారు.

సీఎం పర్యటనకు ఏర్పాట్లు


నేమకల్లు గ్రామంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ

బొమ్మనహాళ్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పర్యటనకు ముమ్మరంగా ఏర్పాట్లు సాగుతున్నాయి. సామాజిక భద్రత పింఛన్లను పంపిణీ చేసేందుకు ఈ నెల 30న ముఖ్యమంత్రి బొమ్మనహాళ్ మండలం నేమకల్లు గ్రామానికి వస్తున్నారు. కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్, వివిధ శాఖల అధికారులు గ్రామంలో పర్యటించి ఏర్పాట్లు పరిశీలించారు.

అక్రమార్కులను అరెస్టు చేయాలి

సీఎంకు సీపీఐ జగదీష్ బహిరంగ లేఖ

అనంతపురం విద్య, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సోలార్ విద్యుత్ ముడుపుల బాగోతంపై కేసులు నమోదు చేసి, అక్రమార్కులను వెంటనే అరెస్టు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు గురువారం బహిరంగ లేఖ రాశారు. అదానీ కంపెనీతో జగన్ ప్రభుత్వం విద్యుత్ యూనిట్ ధర రూ.1.99కు కొనుగోలు చేసి, రూ.2.49 చెల్లించారని అన్నారు. ఈ వ్యవహారంలో రూ.1750 కోట్లు ముడుపుల రూపంలో అందాయని అమెరికా దర్యాప్తు సంస్థలు స్పష్టం చేశాయని అన్నారు. అమెరికాలో కేసులు కూడా నమోదయ్యాయని అన్నారు. ఈ అవినీతి ఒప్పందాల వల్ల రాష్ట్ర ప్రజలపై రూ.42 వేల కోట్ల భారం పడిందని మండిపడ్డారు. ముడుపుల బాగోతంపై కేసులు పెట్టింటి ప్రతిపక్షాలు, ప్రత్యర్థులు కాదని, ఏకంగా అమెరికా దర్యాప్తు సంస్థలే కేసులు పెట్టాయని గుర్తుచేశారు. ఈ అక్రమాలపై రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మౌనం వహించడం సరికాదని అన్నారు. జగన్ ప్రతిపక్ష నాయకుడని, ఇటీవలి ఎన్నికల్లో 40 శాతం ఓట్లు వచ్చాయని కేసులు పెట్టేందుకు, అరెస్టు చేసేందుకు కూటమి ప్రభుత్వం జంకుతోందా అని ప్రశ్నించారు. విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారంపై విచారణ చేసి, చర్యలు తీసుకోకపోతే ఈ ప్రభుత్వం చెడ్డపేరు మూటగట్టుకోక తప్పదని హెచ్చరించారు.

హామీలను అమలు చేయండి

వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



అనంతపురం క్రైం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు మాటలకే పరిమితమయ్యారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. వైసీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వానికి ఆరు నెలల హనీమూన్ పిరియడ్ ముగిసిందని, ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని అన్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలన్నీ దెబ్బతిన్నాయని, దిగుబడులు రాని పరిస్థితి నెలకొందని అన్నారు. ఉమ్మడి జిల్లాలో 63 మండలాలుంటే ఈ ఏడాది 17 మండలాలనే కరువు జాబితాలో చేర్చడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. రైతు భరోసా పథకం పేరును అన్నదాతా సుఖీభవగా మార్చుకున్నారని, కానీ వాళ్లు అధికారంలోకి వచ్చి సుఖంగా ఉన్నారని ఎద్దేవా చేశారు. రూ.20 వేలు ఇస్తామని చెప్పి ఇంకా ఇవ్వలేదని అన్నారు. వరి, వేరుశనగను కల్లాల్లో వేసుకుని రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని అన్నారు. 37 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం సేకరిస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారని, ఇప్పటివరకు 4.50 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించారని అన్నారు. రాష్ట్రంలో ఆయిల్ ఫెడ్ అనేది ఉందా అని ప్రశ్నించారు. ప్రజా ప్రతినిధులు జగన్‌ను విమర్శించడమే తప్ప సమస్యలను పట్టించుకోవడం లేదని అన్నారు. అధికార యంత్రాంగం నిద్రమత్తులో ఉందని విమర్శించారు. ఇసుక, మట్టి, మద్యం, బూడిద అమ్మకాలపైనే ఎమ్మెల్యేల దృష్టి ఉందని విమర్శించారు.

క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ అని వక్తలు పేర్కొన్నారు. స్థానిక అనంత క్రీడాగ్రామంలోని జూడో ఇండోర్ స్టేడియంలో గురువారం హరీష్‌కుమార్ యాదవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని ఎన్‌సీసీ క్యాడెట్లకు ఎస్ఎల్ఆర్ డ్రిల్ రైఫిల్స్ అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు.. సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎన్‌సీసీ క్యాడెట్లు అంటే భావి సైనికులు అని కొనియాడారు. కార్యక్రమంలో ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి, హరీష్‌కుమార్ యాదవ్, జాతీయ యువజన అవార్డు గ్రహీత బిసాటి భరత్ తదితరులు పాల్గొన్నారు.

అహుడాలో అలజడి

రెండు కంప్యూటర్లు ఫార్మాట్

అవినీతి సమాచారం డిలీట్..?

ఏఓ దీర్ఘకాలిక సెలవు



అనంతపురం క్రైం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అనంతపురం-హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో అంతా గుట్టుగానే జరిగిపోతుంటుంది. ఏదున్నా.. అధికారులు, రియల్టర్లు, ఎల్‌టీపీల మధ్యనే ఉంటుంది. ప్రజలతో పెద్దగా సంబంధాలు ఉండవు. దీంతో ఎవరూ అహుడా కార్యాలయంలోకి అడుగు పెట్టరు. లే అవుట్ల అప్రూవల్స్ కోసం ఎంత వసూలు చేశారు..? పనులకు ఎంత బిల్లులు పెట్టుకుంటున్నారో అర్థం కాని పరిస్థితి. అహుడాలో గత కొన్నేళ్లుగా భారీ గోల్‌మాల్ జరుగుతోందని ప్రచారం ఉంది. భారీ మొత్తంలో నిధులు మళ్లించినట్లు తెలుస్తోంది. దొంగ బిల్లులతో కొందరు జేబులు నింపుకున్నట్లు సమాచారం. అహుడా వైస్ ఛైర్మన్‌గా జాయింట్ కలెక్టర్ బాధ్యతలు చేపట్టాక అక్రమాలు బయటపడుతున్నట్లు తెలిసింది. బిల్లుల గురించి ఆయన ఆరా తీసినట్లు సమాచారం. అహుడా ఛైర్మన్ టీసీ వరుణ్‌కు కొంతకాలం పరీక్ష తప్పదని అంటున్నారు.

ఏఓ సెలవు

అహుడాలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ) అకౌంట్స్ విభాగం చూస్తారు. ఏఓ లక్ష్మీదేవి దీర్ఘకాలిక సెలవులోకి వెళ్లడం ఆ శాఖలో ప్రకంపనలు రేపుతోంది. ఎవరైనా అధికారి కొన్ని రోజులపాటు సెలవు పెడితే.. ఇన్‌చార్జ్ బాధ్యతలు కిందిస్థాయి వారికి అప్పగిస్తారు. కానీ ఏఓ తొలుత వారం రోజులు సెలవు పెట్టారు. తరువాత ఏకంగా 50 రోజులు పొడిగించుకున్నారు. కానీ ఎవరికీ చార్జ్ ఇవ్వలేదు. ఆమె వినియోగిస్తున్న కంప్యూటర్‌ను ఆన్ చేయడానికి ప్రయత్నిస్తే.. పాస్‌వర్డ్ అడుగుతోంది. ఫోన్ చేసి తెలుసుకుని ఆన్ చేస్తే.. అందులో ఏమీ కనిపించలేదు. దీంతో అధికారులు అవాక్కయ్యారు. మొత్తం ఫార్మాట్ చేసినట్లు తెలిసింది. ఎందుకిలా చేశారో తెలుసుకునేందుకు అధికారులు ఫోన్ చేస్తే.. ఏఓ స్పందించలేదని సమాచారం. కొన్ని బిల్లులపై జేసీ ఆరా తీయడంతో ఆమె సెలవు పెట్టారని ఆ శాఖలో ప్రచారం జరుగుతోంది.

ఎవరెవరున్నారో...?

అహుడాలో ఉన్నతాధికారి వైస్ ఛైర్మన్. ఆ పోస్టులో ఇదివరకు మురళీకృష్ణ గౌడ్ ఉండేవారు. ఆయన ఉపయోగించే సిస్టమ్ కూడా ఫార్మాట్ అయినట్లు సమాచారం. ఫార్మాట్ చేసిందెవరు అనేది చర్చనీయాంశంగా మారింది. వైసీపీ హయాంలో భారీగా అవినీతి జరిగిందని సమాచారం. వైసీపీ హయాంలో అహుడా ఛైర్మన్‌గా మహాలక్ష్మి శ్రీనివాస్ కొనసాగారు. అప్పట్లో అనధికార లేఅవుట్లకు అప్రూవల్స్ లేకుండానే రిజిస్ట్రేషన్లు చేయించారు. కొన్ని లే అవుట్ల విషయంలో అధికారులు, నేతలతో రియల్టర్లు ముడుపుల వ్యవహారం నడిపినట్లు ఆరోపణలు ఉన్నాయి.

కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు

పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దనగౌడ్


మాట్లాడుతున్న పెద్దనగౌడ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నందుకు పెన్షనర్ల తరపున కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నామని ఏపీ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దనగౌడ్ అన్నారు. సంఘం కార్యాలయంలో జిల్లాలోని పెన్షనర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో 2000, 10, 11, 12, 13 సంవత్సరాల్లో రిటైర్ అయిన ఉద్యోగులకు కమిటేషన్, రికవరీ నిలుపుదల చేసి ఖాతాలలో సొమ్ము జమ చేయడం ఆనందంగా ఉందని అన్నారు. వైసీపీ ప్రభుత్వం క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను 10 శాతం నుంచి 7 శాతానికి, 15 శాతం నుంచి 12 శాతానికి కుదించి పెన్షనర్లను ఇబ్బందులకు గురిచేసిందని అన్నారు. కూటమి ప్రభుత్వం తగ్గించిన క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను పెంచి న్యాయం చేయాలని కోరారు. డీఆర్, డీఆర్ అరియర్స్‌ను వెంటనే ప్రకటించాలని, అవసానదశలో ఉన్న పెన్షనర్లకు ఊరట కలిగించాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి శీలా జయరామప్ప, కోశాధికారి రామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.



సమన్వయ కమిటీ సమావేశానికి హాజరైన జిల్లా ఇన్‌చార్జి మంత్రి టీజీ భరత్, మంత్రి పయ్యావుల కేశవ్

కష్టపడిన వారికి ప్రాధాన్యం

సాధ్యమైనన్ని పదవులు వస్తాయి
పార్టీ సమన్వయ కమిటీ సమావేశంలో మంత్రులు టీజీ భరత్, కేశవ్

అనంతపురం అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ అధినాయకత్వం గుర్తింపునిస్తుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి టీజీ భరత్ అన్నారు. కమ్మ భవన్‌లో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ అధ్యక్షతన గురువారం పార్టీ సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కియ సమీపంలో మరో పెద్ద పరిశ్రమ రాబోతోందని అన్నారు. కరువు జిల్లాలో పరిశ్రమలు స్థాపించి, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని అన్నారు. గతంలో మాదిరిగా ఎమ్మెల్యేలు, ఎంపీలు లెటర్లు ఇస్తే పదవులు ఇచ్చే పరిస్థితి లేదని, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. జిల్లా నాయకులకు నిత్యం అందుబాటులో ఉంటానని అన్నారు. జిల్లా అభివృద్ధి కోసం కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. పార్టీ సభ్యత్వ నమోదును నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలని ఎమ్మెల్యేలు, నాయకులకు సూచించారు.

సమష్టిగా పనిచేయాలి: కేశవ్

ప్రజలకు మరింత చేరువయ్యేందుకు సమష్టిగా పనిచేయాలని పార్టీ నాయకులకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సూచించారు. కొత్త వారితో సభ్యత్వం చేయించాలని, గతంలో సభ్యత్వం తీసుకున్న వారికి రెన్యువల్ చేయాలని సూచించారు. అవకాశం ఉన్న ప్రతి ఒక్కరికీ పదవులు ఇవ్వాలని పార్టీ అధినాయకత్వం ప్రయత్నిస్తోందని అన్నారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు. స్థలాన్ని సేకరించి.. త్వరలో పార్టీ జిల్లా కార్యాలయ భవనాన్ని నిర్మించాలని నిర్ణయించారు. రైతు సమస్యలు, సాగునీటి ప్రాజెక్టులు, సంక్షేమ పథకాల గురించి చర్చించారు.

వైసీపీ నాయకుల మాటే చెల్లుతోంది: రామలింగారెడ్డి

టీడీపీ అధికారంలోకి వచ్చినా ప్రభుత్వ కార్యాలయాల్లో వైసీపీ నాయకుల మాటే చెల్లుతోందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి ఇన్‌చార్జి మంత్రితో అన్నారు. బుక్కరాయసముద్రం సీఐ వైసీపీ నాయకులకే పనిచేస్తున్నారని అన్నారు. అధినాయకత్వం దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని అన్నారు. మండలంలో సగం ఎఫ్‌పీ షాపు డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకాలు చేపట్టలేదని, కార్యకర్తలు బాధపడుతున్నారని అన్నారు. త్వరగా నియమకాలు పూర్తి చేసి కార్యకర్తలకు న్యాయం చేయాలని కోరారు.

పనిచేసిన వారిని గుర్తించాలి: ఆలం

వైసీపీ అరాచక పాలనలో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇవ్వాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు ఇన్‌చార్జి మంత్రిని కోరారు. శింగనమల నియోజకవర్గంలో రెవెన్యూ అధికారులు ఇప్పటికీ వైసీపీ మూడ్‌లోనే ఉన్నారని, అలాంటి అధికారులపై తగు నిర్ణయం తీసుకోవాలని కోరారు. గార్లదిన్నె వద్ద జరిగిన ప్రమాదంలో మృతిచెందిన కూలీల కుటుంబాలకు మరుసటి రోజే పరిహారం అందించారని అన్నారు. క్షతగాత్రులకు ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందించారని, ఇందుకు సీఎం చంద్రబాబు, మంత్రి పయ్యావుల కేశవ్, ఇతర ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీ హయాంలో ఘోర రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందినవారి కుటుంబాలకు ఇప్పటికీ ఆదుకోలేదని అన్నారు. సమావేశంలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, బండారు శ్రావణి శ్రీ, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, రాష్ట్ర నాయకులు ఉన్నం హనుమంతరాయ చౌదరి, తలారి ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, గాజుల ఆదెన్న, సాకే గంపన్న, కేఎం జకీవుల్లా, రాయల్ మురళి, దేవళ్ల మురళి, ముంటిమడుగు కేశవరెడ్డి, నటేష్ చౌదరి, ఉన్నం మారుతీ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.33

అనంతపురం రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.33తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు గురువారం 900 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 26, కనిష్ఠ ధర రూ.20 పలికినట్లు ఆయన తెలిపారు.



అభివృద్ధికి విజన్ డాక్యుమెంట్

● సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ ● జిల్లాకు పరిశ్రమలు తీసుకొస్తాం ● డీఆర్‌సీ సమావేశంలో మంత్రులు టీజీ భరత్, కేశవ్



సమావేశంలో ఎస్పీ, కలెక్టర్, మంత్రులు టీజీ భరత్, కేశవ్, జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ప్రభుత్వ విప్ కాలవ

అనంతపురం టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధతో విజన్ డాక్యుమెంట్ రూపొందిస్తున్నారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి టీజీ భరత్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో జిల్లా సమగ్రాభివృద్ధిపై గురువారం డీఆర్సీ సమీక్షా సమావేశం నిర్వహించారు. వ్యవసాయం, నీటి పారుదల, ఉపాధి పథకం, వైద్యం గురించి చర్చ జరిగింది. జిల్లా అభివృద్ధికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని టీజీ భరత్ సూచించారు. ప్రజాప్రతినిధులు ఎలాంటి సమస్యలపై వినతులు ఇచ్చినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఐటీ మంత్రి నారా లోకేష్‌తో కలిసి జిల్లాకు పలు పరిశ్రమలు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. అధికారులపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నీరే ప్రధానం: కేశవ్

● జిల్లా అభివృద్ధికి కీలకమైన సాగు, తాగునీటికి, పరిశ్రమల స్థాపనకు ప్రాధాన్యం ఇస్తామని ఆర్థిక మంత్రి కేశవ్ అన్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు దారుణంగా ఉన్నా.. వాటిని అధిగమిస్తూ అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నామని అన్నారు. ఉద్యోగుల పీఎఫ్ సొమ్మే వైసీపీ ప్రభుత్వం రూ.21 వేల కోట్లు వాడుకుందని అన్నారు. ఇలాంటి సమస్యలను దాటుకుని సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నామని, అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. తమవంతు సహకారం అందిస్తామని అన్నారు.

● కార్యాలయంలో కూర్చోకుండా ఫీల్డ్‌కు వెళ్లాలని జలవనరుల శాఖ ఎస్ఈకి కేశవ్ సూచించారు. హెచ్చెల్సీ, హంద్రీనీవా గురించి అధికారులు వివరిస్తుండగా సుబ్బరాయసాగర్‌కు నీళ్లు వచ్చాయా అని కేశవ్ ప్రశ్నించారు. వచ్చాయని ఎస్ఈ అనడంతో ఎంత వచ్చిందని ప్రశ్నించారు. దీంతో నీరు రాలేదని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి అన్నారు. రైతులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. దీంతో ఫీల్డ్‌కు వెళితే విషయాలు తెలుస్తాయని కేశవ్ సుతిమెత్తగా హెచ్చరించారు. ఏదైనా పక్కా సమాచారమే చెప్పాలని, కాకిలెక్కలు వద్దని అన్నారు.

● డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి తమ శాఖ వివరాలను తెలిపారు. జనవరి నుంచి ఇప్పటి వరకు 121 డెంగీ కేసులు, 9 మలేరియా, ఒక చికున్ గున్యా కేసు వచ్చిందని వివరించారు. దీంతో కేశవ్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. చికున్ గున్యా కేసు ఒక్కటేనా..? లెక్కలు కరెక్టేనా..? ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి చూడండి.. వాస్తవం తెలుస్తుంది అని అన్నారు.



సమావేశంలో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, ఎమ్మెల్యేలు అమిలినేని, దగ్గుపాటి, బండారు శ్రావణి, అధికారులు

వరి ధాన్యం కొనండి: కాలవ

తన నియోజకవర్గంలోని కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాలలో వరి అధికంగా సాగు చేస్తుంటారని, మార్కెట్‌కు తీసుకుపోతుంటే తక్కువ ధర వస్తోందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. ప్రభుత్వం ద్వారా గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని కోరారు.

డబ్బు ఇవ్వండి: అమిలినేని

భైరవాన్ తిప్ప ప్రాజెక్టుకు రైతుల నుంచి భూములను సేకరించారని, వారికి రూ.120 కోట్లకు పైగా పరిహారం చెల్లించాల్సి ఉందని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. ఆ నిధులు మంజూరు చేసి రైతులకు ఇవ్వాలని కోరారు. కళ్యాణదుర్గం ఆస్పత్రిలో బెడ్లు, బీపీ మిషన్లు లేవని, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతులను ఆదుకోండి: శ్రావణి

అధిక వర్షాల కారణంగా గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, నార్పల మండలాలలో రైతులు పంటలు నష్టపోయారని, పరిహారం అందించి ఆదుకోవాలని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కోరారు. సుబ్బరాయసాగర్‌కు వెంటనే నీటిని విడుదల చేయాలని కోరారు.

ఆస్పత్రికి నిధులు ఇవ్వండి: దగ్గుపాటి

అనంతపురం సర్వజన ఆస్పత్రికి రోజుకు రెండు వేల మంది రోగులు వస్తుంటారని, 13వందల మంది ఇన్ పే షెంట్లు ఉంటున్నారని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. కానీ ఆస్పత్రిలో 560 పడకలే ఉన్నాయని, ప్రభుత్వం నుంచి నిధులు ఆ మేరకే వస్తున్నాయని తెలిపారు. రోగులు ఇబ్బంది పడుతున్నారని, నిధులను పెంచాలని కోరారు. చిన్నపాటి వర్షానికే ఇళ్లలోకి నీరు చేరుతోందని, రక్షణ గోడల నిర్మాణానికి నిధులు ఇవ్వాలని కోరారు.

చర్యలు తప్పవు: కలెక్టర్

ప్రభుత్వ పథకాల అమలు విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ హెచ్చరించారు. ప్రతి జిల్లా అధికారి తమ శాఖలను నిరంతరం పర్యవేక్షించాలని, ప్రగతి చూపాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో కూడా అధికారులు, సిబ్బంది పనిచేయాలని మంత్రులు సూచించారు.


బాల్య వివాహం.. ఆరుగురిపై కేసు



బాల్య వివాహంపై ఆరాతీస్తున్న ఐసీడీఎస్ అధికారులు, పోలీసులు

యాడికి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): చెల్లెలి కాపురం చక్కదిద్దాలని భావించిన సోదరుడు.. చేసింది బాల్యవివాహం అని మరిచి కోర్టు మెట్లు ఎక్కాడు. విచారణ సమయంలో విషయం బయట పడటంతో కోర్టు తీవ్రంగా పరిగణించింది. దీంతో రెండు కుటుంబాలవారిపై కేసు నమోదైంది. 2022లో బాల్య వివాహం జరిగిందని, ఐసీడీఎస్ అధికారుల ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేశామని సీఐ ఈరన్న గురువారం తెలిపారు. యాడికి పట్టణానికి చెందిన జయసింహకు, ఓ గ్రామానికి చెందిన బాలిక(14)తో వివాహం జరిగింది. తొమ్మిది నెలల తరువాత విభేదాలు రావడంతో ఇద్దరూ విడిపోయారు. వీరి కాపురాన్ని చక్కదిద్దాలని బాలిక సోదరుడు గుత్తి కోర్టును ఆశ్రయించాడు. బాల్య వివాహం విషయం బయటపడటంతో కోర్టు తీవ్రంగా పరిగణించింది. కోర్టు ఆదేశాల మేరకు ఈ నెల 23న ఐసీడీఎస్ అధికారులు విచారణకు హాజరయ్యారు. బాల్య వివాహంపై చర్యలు తీసుకుని, డిసెంబరు 7లోగా నివేదించాలని ఆదేశించింది. దీంతో ఐసీడీఎస్ అధికారులు క్షేత్రస్థాయిలో విచారించారు. వివాహ సమయానికి బాలికకు 14 సంవత్సరాల 4 నెలల వయసు ఉన్నట్లు నిర్ధారణ అయింది. దీంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలికను వివాహం చేసుకున్న జయసింహతోపాటు అతని తల్లిదండ్రులు లక్ష్మీదేవి, శ్రీరాములు, బాలిక తల్లిదండ్రులు రామలక్ష్మమ్మ, వీరనారాయణ, సోదరుడు రామకృష్ణపై కేసు నమోదైంది.

పాముకాటుతో రైతు మృతి



నాగేంద్ర (ఫైల్)

పెనుకొండ రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటగిరి పాళ్యం గ్రామానికి చెందిన మూగ పాడి రైతు బోయ నాగేంద్ర (29) పాముకాటుతో మృతిచెందాడు. బోయ ఈశ్వరప్ప, పాపమ్మ దంపతుల కుమారుడు నాగేంద్రకు పుట్టుకతోనే మాటలు రావు. పాడిఆవులు పెంచుకుని జీవనం సాగించేవారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం పశువుల మేత కోసం గడ్డి కోసుకొచ్చేందుకు నాగేంద్ర పొలాని కెళ్లాడు. అక్కడ పాము కాటేసింది. ఇంటికి చేరుకున్న నాగేంద్ర మూగ కావడంతో పాము కాటేసిన విషయం చెప్పలేకపోయాడు. కాసేపటికి అపస్మారక స్థితిలో చేరుకోవడంతో కుటుంబీకులు వెంటనే గుట్టూరు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్తుండగా.. మార్గమధ్యలో బుధవారం అర్ధరాత్రి మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. రైతు మృతిపై కేసు నమోదుచేసి, దర్యాప్తు చేపట్టినట్లు కియ పోలీసులు తెలిపారు.

ఫార్మసీతో ఉద్యోగాలు మెండు

నేటి నుంచి ప్రవేశాలకు కౌన్సెలింగ్

అనంతపురం సెంట్రల్, నవంబరు28(ఆంధ్రజ్యోతి): ఫార్మసీ కోర్సు పూర్తిచేస్తే ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. దీంతో ఫార్మసీ కోర్సులకు డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో కళాశాలల్లో చేరడానికి శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడత వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభిస్తోంది. ఏపీ ఈఏపీసెట్-2024లో అర్హత సాధించినవారు అడ్మిషన్‌కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. డిసెంబరు 6వరకు రిజిస్ట్రేషన్, పేమెంట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతుంది. తరువాత సర్టిఫికెట్స్‌ను ఆన్‌లైన్ ద్వారానే కౌన్సెలింగ్ సెంటర్‌లో వెరిఫై చేస్తారు. వచ్చేనెల 3 నుంచి 7వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలి. మార్పులు చేసుకోవడానికి 8న అవకాశం కల్పించారు. కౌన్సెలింగ్ పూర్తిచేసుకున్న వారికి 11న సీట్లను కేటాయిస్తారు. అదేరోజు నుంచి 14 వరకు కళాశాలల్లో సెల్ఫ్ రిపోర్టు చేసుకోవాలి. విద్యార్థుల సహాయార్థం అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

32 కళాశాలలు.. 1481 సీట్లు

ఈఏపీసెట్ ప్రథమ కౌన్సెలింగ్ ద్వారా జేఎన్‌టీయూ పరిధిలోని ఉమ్మడి అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు, నెల్లూరు జిల్లాలో 31 ఫార్మసీ కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు. కన్వీనర్ కోటాకింద మొత్తం 1448 సీట్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఎస్కేయూ ఫార్మసీ కళాశాలలో 33 సీట్లున్నాయి. మొత్తం 32 కళాశాలల్లో 1481 సీట్లు ఉన్నాయి. వీటిలో బీ-ఫార్మసీ 1197, ఫార్మా-డి 251, ఫుడ్ టెక్నాలజీకి 33 సీట్లను కేటాయించారు. జేఎన్‌టీయూ కలికిరి ఇంజనీరింగ్ కళాశాలలో మాత్రమే ఫుడ్ టెక్నాలజీ కోర్సు ఉంది. దీనికి ఈఏపీసెట్‌లో అర్హత సాధించిన ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు కౌన్సెలింగ్‌కు అర్హులు.

మృత్యువులోనూ కలిసే..

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన బైక్.. ఇద్దరు స్నేహితుల దుర్మరణం



దాదు, పవన్‌కుమార్ (ఫైల్)

హిందూపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఇద్దరూ స్నేహితులు. కలిసి మెలిసి ఉండేవారు. మృత్యుఒడికి కూడా కలిసే వెళ్లారు. మండలంలోని తూముకుంట సమీపాన మలుపు వద్ద గురువారం సాయంత్రం ట్రాక్టర్‌ను బైక్ ఢీకొన్న ప్రమాదంలో దాదు(38), పవన్‌కుమార్ (25) దుర్మరణం చెందారు. స్థానిక త్యాగరాజనగర్ పరిధి గాజుల వీధిలో వీరు నివాసముండేవారు. స్నేహితులు కూడా. దాదు కార్పెంటర్ పనికెళ్తుండేవాడు. శివశంకర్, లక్ష్మీనరసమ్మ దంపతుల కుమారుడైన పవన్‌కుమార్ పట్టణంలోని ఓ ల్యాబ్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తుండేవాడు. మధ్యాహ్నం ఇద్దరూ బైక్‌పై గౌరీబిదునూరు వైపు వెళ్లారు. పని ముగించుకుని హిందూపురానికి బయల్దేరారు. తూముకుంట చెక్‌పోస్టు వైపు నుంచి తూముకుంటలోకి వెళ్లేందుకు ట్రాక్టర్ కుడివైపు తిరుగుతుండగా ఎదురుగా వచ్చి ఢీకొట్టారు. ట్రాక్టర్ ట్రాలీ కిందకు బైక్ దూసుకెళ్లింది. దాదు, పవన్‌కుమార్ తలలకు బలమైన గాయాలై, అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న సీఐ ఆంజనేయులు ప్రమాదస్థలాన్ని పరిశీలించి, మృతదేహాలను హిందూపురం ఆస్పత్రికి తరలించారు. దాదుకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.



ప్రమాద స్థలంలో దాదు, పవన్‌కుమార్ మృతదేహాలు

గంజాయి జోలికెళ్తే మటాషే..!



సరఫరాదారులపై పోలీసుల డేగకన్ను
కేసులతోపాటు ఆస్తుల జప్తుకు సన్నాహాలు
ఆధార్, రేషన్‌కార్డు స్వాధీనానికి సిద్ధం
1 నుంచి మహాసంకల్పం పేరుతో అవగాహన సదస్సులు



చిలమత్తూరులో పట్టుబడిన గంజాయి (ఫైల్)

కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం

హిందూపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గంజాయి జోలికెళ్తే మటాషే. కూటమి ప్రభుత్వం.. గంజాయిపై ఉక్కుపాదం మోపుతోంది. కఠిన చర్యలకు ఉపక్రమిస్తోంది. గంజాయి కేసుల్లో పట్టుబడితే ఆస్తులను సైతం జప్తు చేయనుంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎక్కడ చూసినా గంజాయి విచ్చలవిడిగా దొరికింది. యువతతోపాటు విద్యార్థులు, మహిళలు సైతం గంజాయికి బానిసలయ్యారు. ఆ మత్తులో ఎన్నో దుర్మార్గాలకు పాల్పడ్డారు. ఇటీవల హిందూపురంలో పోలీసులకు పట్టుబడిన నేరస్తులు అధిక శాతం గంజాయి సేవించినట్లు రుజువైంది. వీరిలో యువతతోపాటు విద్యార్థులు కూడా ఉండటం కలవర పరుస్తోంది. హిందూపురం ప్రాంతంలో ఇటీవల జరిగిన చాలా నేరాలు గంజాయితో ముడిపడి ఉన్నాయి. దీనినిబట్టి గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గంజాయి, మత్తు పదార్థాలు ఏస్థాయిలో క్షేత్రస్థాయికి విస్తరించాయో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఇటీవల కొంతమంది తల్లిదండ్రులు పోలీసుల వద్దకు వెళ్లి తమ పిల్లలు గంజాయికి బానిసలుగా మారారనీ, ఎలాగైనా వారిని మాన్పించాలని వేడుకుంటుండడం ఆందోళన రేపుతోంది. ఇలాంటి వాటికి పాల్పడుతున్న వారిని, అందుకు కారకులైన వ్యక్తులను ఆరు నెలల్లో పూర్తిస్థాయిలో కట్టడి చేసేందుకు రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం బుధవారం నిర్ణయం తీసుకుంది.

ఆస్తుల జప్తుకు సన్నాహాలు

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గంజాయిపై పోలీసు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అయినా కొన్ని చోట్ల గతంలో ఉన్న కొంతమంది అధికారుల పరిచయాలతో అప్పటి నాయకులు గంజాయి సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మంత్రివర్గ ఉపసంఘం గంజాయిపై ఉక్కుపాదం మోపేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ మహమ్మారిని అంతమొందించేందుకు పలు చర్యలు తీసుకుంటోంది. గంజాయి డ్రగ్స్ ఆనవాళ్లు లేకుండా చేయడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. త్వరలో ఈగల్ 1972 టోల్‌ఫ్రీ నంబరును ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ సందర్భంలో ప్రభుత్వం గంజాయి నిర్వాహకులపై మరింత కఠినంగా వ్యవహరించనుంది. అప్పటికీ మారని గంజాయి క్రయవిక్రయదారులపై మరింత కఠినంగా వ్యవహరిస్తూ వారి ఆస్తుల జప్తుకు కూడా సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా గంజాయి, డ్రగ్స్‌ను రూపుమాపడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తున్నట్లు స్పష్టమవుతోంది.

ఆధార్, రేషన్‌కార్డు స్వాధీనం

గంజాయి నేరస్తులపై కఠినంగా వ్యవహరించే దిశగా ప్రభుత్వం ముందుకెళ్తోంది. గంజాయి నేరస్తులపై కేసులు నమోదుచేయడంతోపాటు వారి ఆస్తులను సైతం జప్తు చేయనున్నారు. వారికి ఆస్తులు లేకపోతే ఆధార్, రేషన్‌కార్డులు స్వాధీనం చేసుకుంటామని ఇటీవల హోంశాఖ మంత్రి అనిత వెల్లడించారు. దీంతో గంజాయి నేరస్తుల్లో అలజడి రేగుతోంది.

పురంలో 32మంది అరెస్టు

పురంలో గంజాయిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. గత ఐదేళ్లలో విచ్చలవిడిగా గంజాయిని చిల్లరకొట్లులో పెట్టి అమ్మినా పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించారు. ఈ వ్యాపారంలో కొంతమంది వైసీపీ వారు ఉండటంతో పోలీసులు వెనక్కు తగ్గారన్నది బహిరంగ రహస్యమే. కూటమి ప్రభుత్వం వచ్చాక వైసీపీకి వీరవిధేయులుగా ఉన్న పోలీసు అధికారులను బదిలీచేసి కొత్తవారిని తీసుకొచ్చారు. దీంతో రెండు నెలల వ్యవధిలో గంజాయి కేసుల్లో 32 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి పెద్దఎత్తున గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

1నుంచి మహాసంకల్పం

గంజాయి, డ్రగ్స్‌కు బానిసలైనవారు ఎలాంటి నేరాలకు పాల్పడతారు, వారి నుంచి సమాజానికి ఎలా చేటు వాటిల్లుతుందో తెలియజేసేందుకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో డిసెంబరు ఒకటో తేదీ నుంచి మహాసంకల్పం పేరుతో పెద్దఎత్తున అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. ఇందుకు జిల్లా, మండలం, గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. అందుకు డ్రోన్లను విరివిగా వినియోగించుకోనున్నారు. రానున్న ఆరు నెలల్లో గంజాయి, డ్రగ్స్‌ను నిర్మూలించే దిశగా ప్రభుత్వం ముమ్మర చర్యలు తీసుకుంటోంది.

గంజాయిని అరికడతాం..



హిందూపురంలో గంజాయికి సంబంధించి అనుమానం ఉన్న 32 మందిని అరెస్టు చేశాం. గంజాయి, డ్రగ్స్ విషయంలో చాలా కఠినంగా వ్యవహరిస్తాం. ఇందుకోసం ప్రత్యేక బృందాల ద్వారా నిఘా పెట్టాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. గంజాయి నేరస్తులకు సంక్షేమ పథకాలు నిలిపివేయడంపై ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఇందుకోసం ఇప్పటికే ప్రభుత్వం ఉత్తర్వులు కూడా విడుదల చేసింది.

\- మహేష్, డీఎస్పీ, హిందూపురం

సరఫరాదారులపై డేగకన్ను

గంజాయి మహమ్మారి సమాజాన్ని ముఖ్యంగా యువత జీవితాలను సర్వనాశనం చేస్తుండటమేకాక కొంతమందిని జీవచ్ఛవాలుగా, నేరస్తులుగా మారుస్తోంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం వీటిపై గట్టి చర్యలు తీసుకునేందుకు ముందుకెళ్తోంది. ఇందులో భాగంగానే బుధవారం మంత్రివర్గం ఉపసంఘం గంజాయి క్రయవిక్రయాలు జరిపేవారిపై ఉక్కుపాదం మోపుతామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్, నారా లోకేశ్ అధికారంలోకి వచ్చిన వెంటనే గంజాయి, మాదకద్రవ్యాలను రూపుమాపుతామని హామీ ఇచ్చారు. ఆ మేరకే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో గంజాయి సరఫరాదారులపై పోలీసులు డేగకన్ను వేశారు. ఇందుకోసం ఈగల్ పేరుతో యాంటీ నార్కొటిక్స్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. నార్కొటిక్స్ పోలీస్ స్టేషన్లు కూడా ఏర్పాటుకానున్నాయి. ఇప్పటికే పోలీసు అధికారులు గంజాయి క్రయవిక్రయాలు జరిపేవారిని గుర్తించి, డ్రోన్ల ద్వారా నిఘా వేస్తున్నారు.

అయ్యో.. పాపం..!

పెద్దదిక్కును కోల్పోయిన ఇంట్లో చోరీ..
నగదు.. బంగారం అపహరణ



చోరీ చేసిన ఇంట్లో పరిశీలిస్తున్న పోలీసులు

భర్తను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉంది. ఆమె ఎలా బతుకుతుందోనని బంధువులు ఆవేదన చెందారు. ఖర్చులకు డబ్బులిచ్చారు. వాటన్నింటినీ అలాగే బీరువాలో పెట్టింది. బిడ్డను తీసుకుని, ఆచారం ప్రకారం ఆలయం వద్దకు నిద్రించేందుకు వెళ్లింది. తిరిగి వచ్చి చూసేసరికి ఇల్లు గుల్లయింది.

నార్పల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఇంటి పెద్దదిక్కును కోల్పోయి 15 రోజులు గడవకనే ఆ ఇంట్లో దొంగలు పడ్డారు. మండలకేంద్రంలోని దూల్‌పేట కాలనీకి చెందిన చాకలి సుధాకర్ (47) గుండెపోటుతో 15 రోజులు క్రితం మృతిచెందాడు. సంప్రదాయ ప్రకారం అతడి భార్య నాగేశ్వరి గూగూడు దేవాలయంలో నిద్ర చేయడానికి బుధవారం రాత్రి ఇంటికి తాళాలు వేసి, కొడుకు సహా వెళ్లింది. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంటి తలుపులు తెరచి, లోపలికి చొరబడ్డారు. బీరువాను రాడ్లతో ధ్వంసం చేసి, అందులోని రూ.1.10 లక్షల నగదు, రెండు తులాల బంగారు నగలు చోరీ చేశారు. గురువారం ఉదయం ఇంటికి తిరిగొచ్చిన నాగేశ్వరి చోరీ విషయాన్ని గ్రహించి గొల్లుమంది. ఎస్ఐ సాగర్ క్లూస్ టీమ్‌ని పిలిపించి, వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. భర్త చనిపోతే బంధువులు, పుట్టింటివారు ఖర్చులకు పనికొస్తాయనీ, పెట్టుకోమని ఆ డబ్బు ఇచ్చారనీ, వాటిని కూడా దొంగలు చోరీ చేసుకెళ్లారని పోలీసుల ఎదుట బాధితురాలు వాపోయింది.

పురుగుల మందు తాగేస్తున్నా..!

సెల్ఫీ వీడియో పెట్టి వ్యక్తి అదృశ్యం





సెల్ఫీ వీడియోలో మందు తాగుతున్న అనిల్, క్రిమిసంహారక మందు

బెళుగుప్ప, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): దుద్దేకుంట గ్రామానికి చెందిన అనిల్ భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సెల్ఫీ వీడియో పంపి అదృశ్యమయ్యాడు. విడపనకల్లు మండలం హావళిగి గ్రామానికి చెందిన గీత అనే మహిళను అనిల్ ఏడాది క్రితం వివాహం చేసుకున్నాడు. మొదటి నుంచి దంపతుల మధ్య సఖ్యత లేదని సమాచారం. దీంతో పెద్దలు ఇటీవల పంచాయితీ చేశారు. కలసి ఉంటామని చెప్పి దుద్దేకుంటకు వచ్చారు. బుధవారం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆత్మహత్య చేసుకుంటున్నానని బుధవారం క్రిమిసంహారక మందు సీసాతో సెల్ఫీ వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. అనిల్ తండ్రి ఎర్రిస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతని సెల్ ఫోన్ స్విచాఫ్ వస్తోందని, కేసు నమోదు చేశామని ఎస్ఐ శివ తెలిపారు. అనిల్ గాలిమరల వద్ద సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు.

న్యూస్ బాక్స్...

పింఛన్ తీసుకోవడంలో వెసులుబాటు

నంబులపూలకుంట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బతుకు తెరువు కోసం వలస వెళ్లిన వారు ఇక నెలనెలా కాకుండా.. మూడు నెలలకు ఒకేసారి పింఛన్ తీసుకునే వెసులుబాటును కూటమి ప్రభుత్వం కల్పించిందని ఇన్‌చార్జీ ఎంపీడీఓ అంజనప్ప స్పష్టం చేశారు. గురువారం మండలంలోని వెలిచెలమల, మరి కొమ్మెదిన్నె సచివాలయాలను తనిఖీ చేసిన ఆయన మాట్లాడారు. భర్త చనిపోయిన వెంటనే అప్‌డేట్ చేస్తే.. భార్యకు పింఛన్ వస్తుందన్నారు. 39 గోకులం షెడ్లు మంజూరయ్యాయమని, వీటిని త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఫారంపాండ్ పూడ్చివేతను అడ్డుకున్న గ్రామస్థులు

గాండ్లపెంట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోట్లపల్లి గ్రామంలో ఫారంపాండ్ గుంతను పూడ్చివేతను రైతులు అడ్డగించారు. గురువారం కోట్లపల్లిలో కటారుపల్లి పంచాయతీ గొల్లపల్లి వాసికి 40 సంవత్సరాల క్రితం ప్రభుత్వ భూమిని సాగు పట్టా ఇచ్చారు. అయితే 40 యేళ్ల నుంచి ఏ ఒక్క రోజు సాగుచేయలేదు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిలో ఉపాధి పథకం కింద ఫారంపాండ్ గుంతలు రూ.లక్షలు ఖర్చు చేసి తవ్వించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఫారంపాండ్ నిండింది. ఉన్నఫలంగా ఆ రైతు తన సాగుకు ప్రభుత్వం ఇచ్చిందని ఆ గుంతలను పూడ్చివేయడానికి ప్రయత్నించాడు. విషయం తెలుసుకున్న రైతులు అడ్డుకుని, ఎక్స్‌కవేటర్‌ను వెనక్కు పంపారు. పశువుల దాహార్తిని తీర్చుతున ఫారంపాండ్ పూడ్చకూడదని రైతులు కోరుతున్నారు.

పన్నులు సకాలంలో చెల్లించండి

ధర్మవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో ఉన్న నీటి, ఆస్థి, ఖాళీ స్థలాల పన్నులు సకాలంలో చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ గురువారం ప్రకటనలో కోరారు. ఏడాదిపైగా ఉన్న నీటి పన్నుల బకాయిలుంటే.. ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా తొలగించడమే కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కావున పన్ను బకాయిలు ఆన్‌లైన్‌లో కానీ మున్సిపల్ కార్యాలయం, ఎల్‌పీ సర్కిల్‌లోని సచివాలయం, పార్థసారధినగర్-2 సచివాలయంలో కాని చెల్లించాలన్నారు.

పనులను తక్షణమే ఆపండి

కొత్తచెరువు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కొత్తచెరువు గ్రామ పంచాయతీలో పాలక వర్గం ప్రమేయం లేకుండా జరుగుతున్న పనులను వెంటనే ఆపాలని వార్డు మెంబరు లక్ష్మీదేవి కుమారుడు సాలమ్మగారి శివ గురువారం ఎంపీడీఓ నటరాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ... గ్రామ పంచాయతీ నిధులను ఇష్టంవచ్చినట్టు వాడుకుంటున్నారని, పాలక వర్గం ప్రమేయం లేకుండా పనులు ఏవిధంగా చేస్తున్నారని ప్రశ్నించారు. ఆ పనులను ఆపేసి బిల్లులు ఇవ్వరాదని కోరారు. ఈ విషయంపై కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశామన్నారు.

సిమెంటు రోడ్డు పరిశీలన

నల్లచెరువు, నవంబరు28(ఆంధ్రజ్యోతి): స్థానిక జెండా మేవమాను వెనుక వైపు వేస్తున్న సిమెంటు రోడ్డును ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త గురువారం పరిశీలించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట జేఈ గుప్త, సచివాలయ ఇంజనీర్లు ఉన్నారు.

క్షేత్ర సహాయకుల సంఘం ఎన్నిక

ఓబుళదేవరచెరువు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం మండల క్షేత్రసహాయకుల కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సన్నగల్ల రామాంజనేయులు, ఉపాధ్యక్షుడిగా పీట్ల మనోహర్, ప్రధాన కార్యదర్శిగా డబురువారిపల్లి ఉత్తప్పను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో క్షేత్రసహాయకులు గంగాద్రి, నరేష్, పెద్దబాబు, అక్కులప్ప, వెంకటనాయక్, రమేష్, వెంకటరామిరెడ్డి, సుబ్బిరెడ్డి, రమణ పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

బుక్కపట్నం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దరాంపురం ప్రభుత్వం ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ప్రోగ్రామ్ అధికారి నివేదిత పరిశీలించారు. ఆమె వెంట హెల్త్ సూపర్‌వైజర్ లింగా రామమోహన్, వైద్య సిబ్బంది సుమల, మానస, రాధ ఉన్నారు.

మీ కోసం.. మీ ప్రభుత్వం

బత్తలపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరమ్మ కాలనీలో మీ కోసం మీ ప్రభుత్వం కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు గురువారం నిర్వహించారు. ఆ కాలనీలోని సమస్యలను ప్రజలు వారి దృష్టికి తీసుకొచ్చారు. కాలనీ ఏర్పడి 20 సంవత్సరాలు కావస్తున్నా కాలనీలో కనీస సౌకర్యాలు లేవన్నారు. వృద్ధులు పింఛన్ కోసం మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎస్సీ కాలనీకి వెళ్తున్నారని, తాగునీటి సౌకర్యం కల్పించాలని, వీధిదీపాలు ఏర్పాటుచేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణరెడ్డి, రమణ, నాగభుషణ, శ్రీరామలు, బొజ్జప్ప, మనోజ్ పాల్గొన్నారు.

రామాలయంలో హుండీ చోరీ

తాడిమర్రి, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి): స్థానిక మద్దెలచెరువు దారిలోని రామాలయంలో హుండీ లోని నగదు చోరీకి గురైంది. గురువారం ఆల యంలో పూజలు నిర్వహించేం దుకు వచ్చిన పురోహితుడు హుండీ తాళం పగలగొట్టి ఉండటాన్ని గమనించి.. ఆలయ ధర్మకర్తలకు సమాచారం అందిం చారు. వారు అక్కడికి చేరుకుని హుండీని పరిశీలించారు. అందులో రూ.5 వేల వరకు ఉండేదని వారు తెలిపారు.



దుండగులు పగలగొట్టిన హుండీ తాళం

ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం

కదిరి అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బేకరీ గంగాధర్‌ను దళిత నాయకులు ఘనంగా సన్మానించారు. గురువారం ఆయన కదిరికి వచ్చిన సందర్భంగా స్థానిక ఆర్‌అండ్ బీ బంగ్లాలో పలు సంఘాల దళిత నాయకులు ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ చంద్రశేఖర్, రాజశేఖర్‌బాబు, మహాజన జర్నలిస్టు ఫెడరేషన్ నాయకులు యల్లమరాజు, ఎమ్మార్పీఎస్ రెడ్డెప్ప, రాజు, గంగాధర్, కళ్యాణ్ పాల్గొన్నారు.

మైనార్టీ రాష్ట్ర చైర్మన్‌కు ..

ధర్మవరం / ఓబుళదేవరచెరువు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): హిందూపురంలో ఎమ్మెల్యే బాలక్రిష్ణ నివాసంలో రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు మౌలానా ముస్తక్ అహమ్మద్‌ను ధర్మవరం, ఓబుళదేవరచెరువు ముస్లిం నాయకులు ఘనంగా సన్మానించారు. ఇందులో జిల్లా మైనార్టీ సంఘం ప్రధాన కార్యదర్శి నాగూర్‌హుస్సేన్, ధర్మవరం నియోజకవర్గ అధ్యక్షుడు అత్తర్ రహీంబాషా, పార్లమెంటు రైతు సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ ఆర్‌ఎంపీ జాకీర్ అహమ్మద్, గ్యాస్ అబ్బు, ఐటీడీపీ నాయకులు పొగాకు షావ్వాజ్ ఉన్నారు.

స్వామి భూములూ స్వాహా!

- లెక్కతేలని మాన్యం, ప్రభుత్వ భూముల వివరాలు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- అస్మదీయులకు ధారాదత్తం



కోట లోపల భూమిని చదును చేసిన దృశ్యం

తాడిమర్రి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవాలయాల్లో దూపదీప నైవేద్యాలు నిర్వహించేందుకు పూర్వీకులు దేవుడు పేరిట ఇచ్చిన భూములను (మాన్యం) కొందరు ఆక్రమించుకున్నారు. వాటిల్లో పంటలు సాగుచేస్తున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోలేదు. వీటితో పాటు మండలంలో ప్రభుత్వ భూముల లెక్కతేల్చడంలోనూ రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రైతులు తగువపడి పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా.. ఆ అధికారులు మాత్రం ఏమీ తెలీనట్లు వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా మండలంలోని తురకవారిపల్లి గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ మాన్యం భూమి ఆక్రమణలో ఉన్నా అధికారులు పట్టించుకోలేదు. అదేవిధంగా కునుకుంట్ల ఈశ్వరస్వామి, రామస్వామి ఆలయాలకు నార్పల మండలం గంగనంపల్లికి చెందిన వారు భూములను ఇచ్చారు. అవి కూడా ఆక్రమణలకు గురయ్యాయి. తాడిమర్రి లక్ష్మీచెన్నకేశవస్వామి మాన్యం భూములతో పాటు తాడిమర్రి కోటలోని భూములు కూడా ఆక్రమణలు జరుగుతున్నా... అధికారులు చూస్తున్నారే తప్పా.. అడ్డుకోవడం లేదు. మండలంలోని నిడిగల్లు ఆంజనేయ స్వామి, చెన్నకేశవస్వామి, తాడిమర్రి వీరభద్రస్వామి ఆలయాలకు మాన్యం భూములున్నా... అవి ఎక్కడ ఉన్నాయో ... ఎవరి ఆధీనంలో ఉన్నాయో అధికారులకు తెలియకపోవడం విడ్డూరం. అలాగే చెరువులకు సంబంధించిన భూములకు కూడా పూర్తీగా ఆక్రమణకు గురైతే.. అధికారులు ఒకరిమీద ఒకరు చెప్పుకుంటున్నారే తప్పా.. పరిష్కారానికి ప్రయత్నించడంలేదు. మరికొందరు అధికారులు మాన్యం, ప్రభుత్వ భూములను అస్మదీయులకు దారాదత్తం చేసి స్వామి భక్తి చాటుకున్నారు. అంతేకాకుండా చెరువులో పట్టాలు ఉన్నాయంటూ వీఆర్వో, వీఆర్ఏ స్థాయి అధికారులు చెబుతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇకనైనా అధికారులు స్పందించి మాన్యం.. ప్రభుత్వ భూముల లెక్కలు తేల్చాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

భూ ఆక్రమణలకు సంబంధించిన ఫిర్యాదులు కొన్ని మా దృష్టికి వచ్చాయి. ప్రజా పరిష్కార వేదిక గ్రామసభల తరువాత వాటిని పరిష్కరిస్తాం. అదేవిధంగా చెరువుల ఆక్రమణలకు సంబంధించిన విషయాన్ని నిర్ధారించి చెరువు ముంపులో ఉన్న పట్టాలను రద్దు చేయడంతోపాటు చుట్టు కందకం తవ్విస్తాం. మాన్యం భూముల సమస్యలనూ పరిష్కరిస్తాం.

-భాస్కర్‌రెడ్డి, తహసీల్దార్

విద్యుత్ లైన్‌కు మరమ్మతులు



నల్లమాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలో చాలా తక్కువ ఎత్తులో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. దీనిపై ప్రమాదకరంగా విద్యుత్ తీగలు అన్న వార్తను ఆంధ్రజ్యోతి గురువారం ప్రచురించింది. స్పందించిన విద్యుత్ అధికారులు ఆ విద్యుత్ తీగలను సరిచేశారు. ఈకార్యక్రమంలో ఎల్ఎం వైవి.సుబ్బారెడ్డి, ఎల్ఐ సురేష్, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

అపార్ ప్రక్రియ 70.71 శాతం పూర్తి

ధర్మవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ధర్మవరం రెవెన్యూ డివిజన్‌లోని ఏడు మండలాల్లో రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం చేపట్టిన అపార్ ప్రక్రియ గురువారానికి 70.71 శాతం పూర్తి అయినట్లు ఆర్డీఓ మహేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడిమర్రి మండలంలో 79.5 శాతం, కనగానపల్లిలో 75.9, బత్తలపల్లిలో 74.9, రామగిరిలో 67.7, ముదిగుబ్బ 66.7, చెన్నేకొత్తపల్లి 65.3, ధర్మవరం మండలంలో 64.9శాతం పూర్తి చేశామన్నారు. ఈ నివేదికలను కలెక్టరేట్‌కు పంపామని, మిగిలిన వాటిని త్వరగా పూర్తి చేయాలని మండల అధికారులను ఆదేశించామని అన్నారు.



ఎపీకుంటలో డిమాండ్ చేస్తున్న ఎస్‌టీయూ నాయకులు

రెసిడెన్షియల్ శిక్షణ రద్దు చేయాలి

నంబులపూలకుంట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ శిక్షణ రద్దు చేసి, నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో నిర్వహించాలని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తూ, తీవ్ర మానసిక ఒత్తిడి మధ్య నిర్వహిస్తున్న ఈ శిక్షణను రద్దు చేయాలన్నారు. మానసిక ఒత్తిడికి గురై.. పలురువు ఉపాధ్యాయులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ రామాంజుల, రమణనాయక్, మురళి, శివయ్య, సందీప్, గోవర్ధన్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, రహీమ్, రామమోహన్, వరలక్ష్మీ, జ్యోతి, రమణయ్య పాల్గొన్నారు.

● ఓబుళదేవరచెరువు : రాష్ట్రంలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ శిక్షణ తరగతులను రద్దు చేయాలని డెమొక్రాటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు గౌస్‌లాజం డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లడుతూ.. శిక్షణను జిల్లా కేంద్రంలోని నాన్‌రెసిడెన్షియల్ విధానంలో నిర్వహించాలని కోరారు. వ్యక్తిగత సెలవులపై పాఠశాల విద్యాశాఖ పరిమితి విధించడం సరికాదన్నారు. పాఠశాల, మండలస్థాయి సిబ్బందితో ఏడు నుంచి పదిశాతం మంది మాత్రమే సెలవులు తీసుకోవాలని షరత్తులు విధించడం సరికాదన్నారు. ఆయన వెంట మండలాధ్యక్షుడు నరసింహులు, ప్రధానాధ్యక్షుడు సోమశేఖర్ నాయక్ ఉన్నారు.



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పల్లె

పూలేకు ఘన నివాళి

పుట్టపర్తిరూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మహాత్మజ్యోతిరావు పూలే 134వ వర్ధంతి సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయలో ఆయన చిత్రపటం వద్ద మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ... కులం పేరుతో తరతరాలుగా అణిచివేతకు గురవుతున్న బడుగు బలహీన వర్గాల ప్రజలకు పూలే అండగా నిలిచారన్నారు. స్త్రీలకు ఆత్మస్థైర్యాన్ని కల్పించి వారి హక్కుల కోసం పోరాడిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● సభ్యతం నమోదుపై అవగాహన

నల్లమాడ : టీడీపీ సభ్యత్వ నమోదుపై అవగాహన కార్యక్రమాన్ని మండల కన్వీనర్ షైలే శివశంకర్ నివాసంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కన్వీనర్ కేశవరెడ్డి, సర్పంచ్‌లు భారతీబాయి, ప్రభాకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

● మృతులకు నివాళి

నల్లమాడ/కొత్తచెరువు: నల్లమాడ మండలంలోని కొత్తపల్లి తండాలో టీడీపీ కార్యకర్త లక్ష్మీపతినాయక్ తండ్రి నానేనాయక్ మరణించాడు. అలాగే కొత్తచెరువు మండలంలోని తలమర్ల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కమ్మన్న అనారోగ్యంతో గురువారం మరణించాడు. వీరి మృతదేహాలకు మాజీ మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేరాల నియంత్రణకు కృషి చేయండి : ఎస్పీ

ధర్మవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు పోలీసు అధికారులు అందరూ సమష్టిగా కృషి చేయాలని ఎస్పీ వి.రత్న ఆదేశించారు. గురువారం ధర్మవరం పోలీస్ గెస్ట్ హౌస్‌లో ధర్మవరం సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో నిర్వహించిన నెలవారి సమీక్ష సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పూర్తి చేయాలన్నారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. గ్రామాల్లో పల్లెనిద్రలు నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్సీ సీఐ బాలసుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

జర్నలిస్టు సంక్షేమనిధికి ఎమ్మెల్యే విరాళం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సంఘం నాయకులు

కదిరి అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (ఏపీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంక్షేమనిధికి కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ రూ.లక్ష విరాళం అందచేశారు. గురువారం ఆయన నివాసంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు పుల్లయ్య, ప్రధాన కార్యదర్శి డి.బాబు ఎమ్మెల్యేని సన్మానించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు తలారి నరసింహులు, చంద్రశేఖర్, ఫారూక్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ తనిఖీ

నల్లచెరువు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోడల్ స్కూల్‌ను ఎంఈఓ తిరుపాల్‌నాయక్ గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులకు పీహెచ్‌సీ వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న విధానం పరిశీలించారు. అనంతరం మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు.

సర్వసభ్య సమావేశం బహిష్కరణ



సమావేశం నుంచి వెళ్తున్న ప్రజాప్రతినిధులు

కొత్తచెరువు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించని సర్వసభ్య సమావేశం ఎందుకని అధికారులపై మండలంలోని ప్రజాప్రతి నిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సమావేశాన్ని బాయ్‌కాట్ చేశారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ నటరాజ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. మొదట సమావేశంలో ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. గత సమావేశాల్లో ప్రస్తావించిన సమస్యలు పరిష్కారం కాలేదని వాపోయారు. మండలంలోని పంచాయతీలకు నిధులు వస్తుంటే వాటిని రాజకీయంగా అడ్డుకొంటున్నారని వాపోయారు. పార్టీలకు అతీతంగా గ్రామాలు, పంచాయతీల అభివృద్ధికి ఎమ్మెల్యే పల్లెసింధూరారెడ్డి సహకరించాలని, స్థానిక అధికార పార్టీ నాయకులు కక్షసాధింపు ధోరణి వీడాలని కోరారు. అనంతరం సమావేశాన్ని బాయ్‌కాట్ చేశారు. ఎంపీడీఓ వారిని బుజ్జగించడానికి ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో అధికారులే తూతూ మంత్రంగా ఆ సమావేశాన్ని నిర్వహించారు.

అడవులను కాపాడండి

బుక్కపట్నం: జిల్లాలోని అడవులు అగ్నికి ఆహుతి కాకుండా కాపాడలని పర్యావరణవేత్త భాస్కర్‌నాయుడు గురువారం జిల్లా అటవీ అధికారి చంద్రమౌలికి వినతిపత్రం అందించారు. అటవీ బీట్ల పరిధిలో ఒక ఫైర్ వాచర్‌ను నియమించాలని, రైతులను, గొర్రుల కాపరులను, వేటగాళ్లు అడువుల్లోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట హ్యూమన్‌రైట్స్ ఆర్గనైజింగ్ సభ్యుడు రాంప్రసాద్ ఉన్నారు.

కార్మికుల సమ్మె విరమణ

ముదిగుబ్బ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మేజర్ పంచాయతీ కార్మికులు ఎనిమిది రోజులుగా చేస్తున్న సమ్మెను గురువారం విరమించారు. సాయంత్రం అధికారులు 14 మందికి ఆర్డర్ కాపీలు అందించడంతో ఆ కార్మికులు తాత్కాలికంగా సమ్మెను నిలిపేశారు. కాగా ఉదయం సమ్మెలో భాగంగా సీఐటీయూ, సీపీఎం ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు దుకాణాల వద్ద భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఈ కార్య క్రమంలో జిల్లా గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రమేశ్, సీపీఎం మండల కార్యదర్శి బండల వెంకటేశ్, అవాజ్ కమిటీ ప్రధాన కార్యదర్శి బాబ్జాన్, చికెన్ రఫీ, డ్రైవర్‌బాబా, టైలర్ ముత్తు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



భిక్షాటన చేస్తున్న పంచాయతీ కార్మికులు

ఆహార సంరక్షణపై అవగాహన

కదిరి అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆహార సంరక్షణపై గురువారం అవగాహన కల్పించారు. సానిక బేకరీ కేంద్రాలకు విద్యార్థులను తీసుకెళ్లి.. కేక్‌లు, మిఠాయిలు, ఇతర పదార్థాల తయారీపై అవగాహన కల్పించారు. ఇందులో ప్రధానోపాధ్యాయులు లియాకత్ అలీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలతో అనర్థాలపై అవగాహన

బుక్కపట్నం: బాల్యవివాహాలతో కలిగే అనర్థాలపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కౌసల్యాసాయి గురువారం రాత్రి స్థానిక తేరుకూడలిలో స్థానికులకు అవగాహన కల్పించారు. బాల్యవివాహాలను అడ్డుకుంటామని అధికారులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ క్రిష్ణమూర్తి, అంగన్‌వాడీలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి కోసం దరఖాస్తు చేసుకోండి

కదిరి అర్బన్: ఆసక్తి ఉన్న అర్హులు ఇంటి కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ పొలప్ప తెలిపారు. గురువారం వీరేపల్లి పేట ఎస్సీకాలనీలో ఆయన పర్యటించారు. ఇంటి స్థలం ఉన్న వారికి గృహాన్ని నిర్మించేందుకు ప్రభుత్వాలు సహకారం అందిస్తున్నాయన్నారు. ఆసక్తిగలవారు ఆధార్, జాబ్‌కార్డు, బ్యాంక్‌ఖాతా, రేషన్‌కార్డు, స్థలం పట్టా, రిజిస్టర్డ్ డాక్యుమెంటు జిరాక్స్‌లతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

న్యూస్‌బాక్స్

రేపే పింఛన్ల పంపిణీ

గోరంట్ల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పింఛన్ల పంపిణీ శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరేంద్రకుమార్ తెలిపారు. మండలంలోని 11,385 మందికి రూ.4,82,89,500 మంజూరైందన్నారు. ఆదివారం ప్రభుత్వ సెలవు కావడంతో శనివారమే పంపిణీ జరుగుతుందన్నారు. డిసెంబర్‌నెలనుంచి పింఛన్ మొత్తాన్ని తీసుకోలేనివారికి మూడునెలల మొత్తం ఒకేసారి తీసుకునే వెసులుబాటు అమలులోకి వచ్చిందన్నారు. అలాగే భర్త మృతిచెందితే భార్య తగిన ధృవీకరణ పత్రాలు సమర్పిస్తే మరుసటి నెలనుంచి ఆమె పేరున పింఛన్ మార్చి అందచేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.

14న మెగా లోక్ అదాలత్



మాట్లాడుతున్న న్యాయాధికారి వాసుదేవన్

పెనుకొండ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): డిసెంబర్ 14న స్థానిక కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు న్యాయసేవాసమితి అధికారి వాసుదేవన్ పేర్కొన్నారు. గురువారం స్థానిక కోర్టులో అదాలత్ నిర్వహణపై సమావేశం నిర్వహించారు. సమావేశంలో పోలీస్ అధికారులు న్యాయవాదుల సంఘం అధ్యక్షులు, న్యాయవాదులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వాసుదేవన్ మాట్లాడుతూ మెగా లోక్‌అదాలత్‌లో కాంపౌండ్ క్రిమినల్, సివిల్ కేసులు, ఎన్‌ఐ యాక్ట్ కేసులు, మెయింటెనెన్స్ కేసులు ప్రీలిటికేషన్ కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. సమావేశానికి జూనియర్ సివిల్ న్యాయాధికారి బుజ్జప్ప, అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి ముజీబ్ పసపల సయ్యద్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, బార్‌అసోసియేషన్ అధ్యక్షులు, న్యాయవాదులు, హాజరయ్యారు.

ఫిర్యాదుపై జేసీ విచారణ



కొక్కోవాండ్లపల్లిలో విచారణ చేస్తున్న జేసీ

చిలమత్తూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో సోమఘట్ట పంచాయతీ కొక్కోవాండ్లపల్లికి చెందిన కుళ్లాయప్ప ఇచ్చిన పిర్యాదుపై జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ గురువారం విచారణ చేపట్టారు. ఆయన స్వయంగా కొక్కోవాండ్లపల్లికి వచ్చి పిర్యాదీదారులతో మాట్లాడారు. పిర్యాదీదారుడు తనకు చెందిన భూమికి పట్టాదార్ పాసుపుస్తకం ఇవ్వాలని కోరగా అందుకు సంబంధించి భూరికార్డులను పరిశీలించి గ్రామంలో విచారణ చేపట్టారు. అయితే పిర్యాదీదారుడు కోరుతున్నట్లుగా రికార్డులు సరిగా లేనందున ఈ సమస్య తమ పరిధిలోకి రాదని, దీనిపై సివిల్ కోర్టుకి వెళ్లాలని ఆయన సూచించారు. జేసి వెంట తహసీల్దార్ యునస్ బాబు, ఇతర రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



జాతీయస్థాయికి ఎంపికైన లోహిత్

లేపాక్షి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):కొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న లోహిత్ జాతీయస్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శేషగిరి తెలిపారు. ఈనెల 24నుంచి 26వరకు తిరుపతిలో జరిగిన అండర్-14బేస్ బాల్ పోటీల్లో లోహిత్ ప్రతిభ కనబరిచాడన్నారు. సెలెక్టనర్లు అతని ఆటతీరును పరిశీలించి డిసెంబర్ 19నుంచి 22వరకు ఛత్తీస్‌ఘడ్‌లో జరిగే జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున ఆడేందుకు అతడిని ఎంపిక చేశారన్నారు. ఈ పోటీలలో కూడా మంచి ప్రతిభ కనబరచి ముందుకుసాగాలని తల్లిదండ్రులు, గ్రామస్థులు, ఉపాధ్యాయులు అభినందించారు.

గీతాపారాయణం ప్రారంభం

గోరంట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీవాసవి మహల్‌లో భగవద్గీత పారాయణాన్ని బ్రహ్మకుమారి ఈశ్వరీబాయి విశ్వవిద్యాలయం సుగంధాబేహన్ గురువారం ప్రారంభించారు. మూడురోజులపాటు కర్నాటకకు చెందిన బ్రహ్మకుమారి ఈశ్వరీబాయి, వీణ బేహన్ భగవద్గీత ప్రవచనాలను వినిపిస్తారు. ఈసందర్భంగా వీణబేహన్ మాట్లాడుతూ, భగవద్గీత పారాయణద్వారా సమస్యలు పరిష్కారమవుతాయన్నారు.

పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు



పరిగి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పరిగి నుంచి ఊటుకూరుకు వెళ్లే దారిలో పైడేటి సర్కిల్‌లో పైప్‌లైన్ లీకేజీకి గురువారం మరమ్మతులు చేపట్టారు. రెండ్రోజుల క్రితం భారీవాహనాల సంచారంతో బస్టాండు సమీపంలో ఇళ్లకు వచ్చే నీటి పైప్‌లైన్ దెబ్బతిని నీరు లీకేజీ అవుతూ వాహనదారులకు ఇబ్బందికరంగా మారడంతో పంచాయతీ కార్యదర్శి నారాయణ స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించారు.

బాల్యవివాహాలతో భవిష్యత్తు అంధకారమే

పెనుకొండ టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : వివాహం చేసే తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బాల్య వివాహాలపై పూర్తీ అవగాహన కలిగి ఉండాలని అలాకాకుండా తొందరపడి వివాహాలు చేస్తే మీ పిల్లల భవిష్యత్తును మీరే అంధకారంలో నెట్టినవారవుతారని సమత స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఎన్‌జీఓ కార్యాలయంలో సభ్యులు సమావేశం నిర్వహించి బాల్య వివాహాలు అరికట్టేందుకు పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో భారత ప్రభుత్వం బాల్‌వికాస్, ముక్త్ భారత్ అనే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. బాల్య వివాహాలను ఆపడానికి 250మందికిపైగా ఎన్‌జీఓ సభ్యులు పనిచేస్తున్నారన్నారు. ఇప్పటికే నల్లచెరువు మండలంలో బాల్యవివాహాలు అరికట్టి అవగాహన కల్పించామన్నారు.

పాచి నీరే పానకం



- ఐదేళ్లుగా ట్యాంకులను పట్టించుకోని సర్పంచులు
- కలుషిత నీటితో రోగాలపాలవుతున్న గ్రామస్థులు
- కూటమి ప్రభుత్వంలోనైనా శుభ్రం చేస్తారా?

ఇంట్లో బిందెలో నీరు ఒకరోజు గడిచాయంటే పాచినీరని పారబోస్తాం. వాటిని తాగడానికి ఇష్టపడం. అలాంటిది పది గ్రామాల్లో ఐదు ఏళ్లుగా సర్పంచులకు నిధులు కేటాయించకపోవడంతో తాగునీటి ట్యాంకులను పట్టించుకునేవారే కరువయ్యారు. వాటిని శుభ్రం చేయకపోవడంతో గ్రామస్థులంతా ఆ నీరే తాగాల్సి వస్తోంది. మరి రోగాలు రాకుండా ఎలా ఉంటాయి?

పెనుకొండ రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): దేశానికి గ్రామాలే పట్టు కొమ్మలు. అలాంటి గ్రామాల్లో ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాంకులను పదిహేను రోజులకొకసారి శుభ్రం చేయాలి. వాటి నిర్వహణను అధికారులు గాలికి వదిలేశారు. ఈ ట్యాంకుల నుంచి కొళాయిలద్వారా వచ్చేనీటినే చాలా ఏళ్లుగా ప్రజలు తాగుతున్నారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు నిర్మించిన ఈ మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయకపోవడంతో గత కొన్నేళ్లుగా నీరు పాచిపట్టిపోయాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా గుట్టూరు, వెంకటగిరిపాళ్యం, మునిమడుగు, కురుబవాండ్లపల్లి, యర్రమంచి, రాంపురం, శెట్టిపల్లి, మావటూరు, నాగలూరు, అడదాకులపల్లి గ్రామాల్లో మంచినీటి ట్యాంకులు ఏర్పాటు చేశారు. ట్యాంకుల నుంచి వచ్చే ఈ కలుషిత నీటినే తాగాల్సిన పరిస్థితి నెలకొందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు.

వైసీపీ పాలనలో సర్పంచులకు ప్రత్యేకంగా నిధులు కేటాయించకపోవడంతో ఐదేళ్లలో ఇప్పటి వరకు తాగునీటి ట్యాంకులను శుభ్రంచేసిన పాపాన పోలేదు. ఈ నీరే సేవిస్తుండటంతో రోగాలబారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆయా గ్రామాల్లో అపరిశుభ్రంగా మారిన నీటి ట్యాంకులను శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

15 రోజులకోసారి శుభ్రం చేయిస్తాం



నరేష్ కృష్ణ, ఎంపీడీఓ

నేను ఇటీవలే నూతనంగా బాధ్యతలు తీసుకున్నా. పంచాయతీ గ్రామాల్లో తాగునీటి ట్యాంకులు అపరిశుభ్రంగా ఉన్నాయన్న విషయం నా దృష్టికి రాలేదు. పంచాయతీ కార్యదర్శుల ద్వారా గ్రామాల్లో 15రోజులకోసారి ట్యాంకులు శుభ్రం చేయిస్తా.

అమ్మో! ఫ్రీహోల్డ్ వెరిఫికేషనా?

- అర్ధరాత్రి వరకు తప్పని విధి నిర్వహణ
- ఆందోళన చెందుతున్న మహిళా వీఆర్వోలు



రాత్రి పూట విధులు నిర్వహిస్తున్న వీఆర్‌ఓలు

పెనుకొండ టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రెవెన్యూశాఖలో ఏ చిన్న పని జరగాలన్నా వీఆర్‌ఓ నుంచే మొదలవుతుంది. అలాంటి కీలకపాత్ర పోషించే వీఆర్‌ఓలు 'ఇదేం ఉద్యోగం?' అంటూ తలలు బాదుకుంటున్నారు. గతంలో ఉదయం గ్రామ సమస్యలు పరిష్కరించి సాయంత్రం విధులు ముగించుకుని ఇంటికి వెళ్లేవారు. అలాంటిది నాలుగు నెలల నుంచి రాత్రింబగళ్లు అనే తేడాలేకుండా అర్ధరాత్రి వరకు విధులు నిర్వహించి కుటుంబాలకు దూరంగా ఉండే పరిస్థితి నెలకొంది. దీనికి కారణం ఫ్రీహోల్డ్ ల్యాండ్ వెరిఫికేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాలు రావడమే. ఈ క్రమంలో వీఆర్‌ఓలు ఉద్యోగంపై విరక్తిచెంది ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా వివాహం కాని వీఆర్‌ఓలు ఒత్తిడి తట్టుకుని ఉద్యోగం చేస్తున్నారు. పెళ్లైన మహిళా వీఆర్‌ఓల పరిస్థితి మరీ దారుణంగా మారింది. రాత్రిపగలు తేడాలేకుండా ఆన్‌లైన్ చేస్తున్నారు. ఇప్పటికైనా మహిళా వీఆర్‌ఓలకు విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతున్నారు.

అనారోగ్యం పాలవుతున్న మహిళా వీఆర్వోలు

2003 ముందుకన్నా పట్టాపొంది సాగులో ఉన్న ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్ చేసుకునేలా ఫ్రీహోల్డ్ జీఓ 563ని గత వైసీపీ ప్రభుత్వం. తీసుకొచ్చింది. అప్పటి ఫ్రీహోల్డ్‌ను అడ్డుపెట్టుకుని ప్రభుత్వం అక్రమాలకు పాల్పడిందని ఎన్‌డీఏ కూటమి రాగానే జీఓను తప్పుదోవ పట్టించారని భారీ ఆరోపణలు రావడంతో వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ క్రమంలో నాలుగు నెలల నుంచి వీఆర్వోలు వెరిఫికేషన్ ప్రక్రియ, రికార్డులు పరిశీలించే పనిలో పడ్డారు. ఈ క్రమంలో మహిళా వీఆర్‌ఓలు ఒత్తిడి తట్టుకోలేక అనారోగ్యానికి గురవుతున్నారు.

ఉన్నతాధికారులు దయ చూపాలి..

ఉదయం నుంచి సాయంత్రం వరకు పని చేస్తూనే ఉన్నామని ఫ్రీహోల్డ్ వేగవంతం కావాలని అర్ధరాత్రి వరకు ఒక్కోసారి తెల్లవారుజాము వరకు విధులు నిర్వహిస్తున్నామని దీంతో ఉద్యోగాలు వదులుకునే పరిస్థితి ఉందని వీఆర్‌ఓలు లోలోపల మథనపడుతున్నారు. పిల్లలు అనారోగ్యం పాలైనా, వీఆర్‌ఓలు వారి కుటుంబాలను పట్టించుకునే పరిస్థితి లేదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా ఫ్రీహోల్డ్ వెరిఫికేషన్ తగ్గించి వీఆర్‌ఓల పని ఒత్తిడి తగ్గించాలని కోరుతున్నారు.

వారు రారు.. ఇంకొకరిని రానివ్వరు..

● పురం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల తీరిది ● నేడు కలెక్టర్ సమీక్ష

హిందూపురం అర్బన్, నవంబరు 28. (ఆంధ్రజ్యోతి): హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ల కొరతలేదని చెబుతున్నప్పటికీ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఇక్కడ నలుగురు వైద్యులు విధులు నిర్వహించాలి. కానీ అందులో ఒక వైద్యురాలు మెటర్నిటీ సెలవులో ఉండగా, ఇంకో వైద్యురాలు సయాటికా సమస్య ఉందని ఒక నెల సెలవుపై వెళ్లారు. అయితే నెల రోజులు ముగిసినా ఆమె విధుల్లోకి చేరలేదు. దీంతో ఇక ఇద్దరే గైనిక్ వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. అందులో ఒక వైద్యుడు డిప్యుటేషన్‌పై వారానికి రెండు రోజులు పెనుకొండకు వెళ్తున్నారు. దీంతో ప్రతి రోజు 80 నుంచి వంద మంది ఓపి ఉన్న హిందూపురం ప్రభుత్వ వైద్యశాలలో గర్భిణీలకు, బాలింతలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి.



హిందూపురం మాతాశిశు సంరక్షణ కేంద్రం

కొత్త వారికి కౌన్సెలింగ్

వైద్య కోర్సు పూర్తి చేసుకొని అర్హత సాధించిన కొత్త వైద్యులకు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరడానికి కౌన్సెలింగ్ నిర్వహించారు. దాదాపు 50 గైనిక్ పోస్టులు జిల్లా వ్యాప్తంగా ఖాళీ ఉన్నట్టు చూపించారు. కానీ హిందూపురంలో ఖాళీలు లేవని చూపారు. ఇక్కడ విధులు నిర్వహించాల్సిన వారు డ్యూటీలకు రారు. విధులకు రాలేకపోయినా రాజీనామా సమర్పిస్తే కొత్త వారికి అయినా అవకాశం వస్తుంది. వారు రారు, ఇంకొకరిని రానివ్వరు అనేలా వ్యవహరించడం విడ్డూరంగా ఉందని సిబ్బంది చర్చించుకుంటున్నారు.

రెగ్యులర్ డాక్టర్లున్నారు: తిప్పేంద్రనాయక్, డీసీహెచ్ఎస్

ప్రస్తుతం రెగ్యులర్ డాక్టర్‌లు ఉన్నారు. అయితే అందులో ఒక వైద్యురాలు మెటర్నిటీ సెలవులో ఉన్నారు. మరో వైద్యురాలు నెల రోజుల సెలవులో వెళ్లారు. నెల దాటినా ఆమె విధుల్లో చేరలేదు. కాబట్టి ఇప్పటికే రెండు సార్లు మెమో ఇచ్చాము. అదే విధంగా శుక్రవారం కలెక్టర్‌తో సమావేశం ఉంది. ఆ సమావేశంలో ఈ సమస్యలను కలెక్టర్‌కు వివరిస్తాము. డాక్టర్ బాబాబుడేన్ డిప్యుటేషన్ రద్దు చేశాము. అందుకే వెకెన్సీ చూపలేదు.

సభ్యత్వ నమోదులో అగ్రస్థానమే లక్ష్యం

● బీసీ సంక్షేమ మంత్రి సవిత



నాయకులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే పెనుకొండ నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలుపుదామని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మునిసిపాలిటీ పరిధిలోని నాయకులతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పెనుకొండ పట్టణాభివృద్ధికి సమిష్టిగా కృషిచేద్దామని, త్వరలో జరగబోయే బాబయ్యస్వామి ఉరుసు మహోత్సవాన్ని విజయవంతం చేద్దామన్నారు. మునిసిపాలిటీ పరిధిలోని 20వార్డుల్లో సమస్యలను గుర్తించి మునిసిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని లేనిపక్షంలో తనదృష్టికి తీసుకురావాలన్నారు. నియోజకవర్గంలో 85వేలకుపైగా సభ్యత్వ నమోదు చేయాల్సి ఉండగా సగానికిపైగా పూర్తి చేశామన్నారు. అధికారం వచ్చిన ఐదు నెలల్లో పెన్షన్ పెంపుతోపాటు పలు హామీలు నెరవేర్చామని ఎన్డీఏ కూటమి ప్రభుత్వంపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. ప్రధాన సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు కొండంపల్లిలో మంత్రి పర్యటన

గ్రామీణ ప్రాంతాల అభివృద్దే ధ్యేయంగా తాగునీటి సదుపాయం కోసం 40లక్షల లీటర్ల సామర్థ్యంగల నీటి ట్యాంకును బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత శుక్రవారం ప్రారంభించనున్నట్లు మండల కన్వీనర్ సిద్దయ్య తెలిపారు. శుక్రవారం ఉదయం 10గంటలకు రాంపురం పంచాయతీ కొండంపల్లి గ్రామంలో మంత్రి పర్యటిస్తారని, అనంతరం నీటి ట్యాంకు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొనున్నట్లు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం : ఇద్దరి అరెస్టు



స్వాధీనం చేసుకున్న మద్యం

మడకశిర రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సరిహద్దు గ్రామాల్లో దాడుతు నిర్వహించి కర్ణాటక మద్యం అమ్ముతున్నా ఇద్దరిని అదుపుకోకి తీసుకోని వారి వద్ద ఉన్న 285 ప్యాకెట్లు కర్ణాక మద్యం స్వాధీనం చేసుకున్నాటు ఎక్సైజ్ ఎస్ఐ శంకర్ తెలిపారు. మండలంలోని టీడీ పల్లి క్రాస్ వద్ద నగేశ్ అనే వ్యక్తినుంచి 40 ప్యాకెట్లు, వద్రహట్టి గ్రామానికి చెందిన తిప్పేస్వామి నుంచి 245 నుంచి కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ కానిస్టేబుల్ పాలొన్నారు.

విద్యార్థి కనబడలేదని పోలీసులకు ఫిర్యాదు



విద్యార్థి చేతన్

మడకశిర రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆమిదాలగింది ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతు న్న చేతన్ అనేవిద్యార్థి పాఠశాలో మధ్యాహ్నం భోజనం అనంతరం కనబడలేదని విద్యార్థి తల్లిదండ్రులు, పుష్పలత,వెంకటస్వామి,ప్రధానోపాధ్యాయులు సాయంత్రం మడకశిర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రులు ,ఉపాధ్యాయులు ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసుకుని విద్యార్థి చేతన్ ఆచూకీకై గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ సర్వీసుల కోసం రైతుల డిమాండ్

అగళి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బోరుబావులలో నీరు పుష్కలంగా ఉండడంతో విద్యుత్ సర్వీస్ ఇవ్వడం లేదని మండలంలోని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వీస్ కోసం డబ్బులు చెల్లించి రెండేళ్లయిందని, నేటికీ ఇవ్వలేదని రైతు సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. అగళి మండలం హెచ్‌డి హళ్లి గ్రామానికి చెందిన రైతులు సురేష్, రామ్‌జీనాయక్, మంజునాథ్ నాయక్, వెంకటేశ్‌నాయక్, రేఖనాయక్, బాలాజీనాయక్ మాట్లాడుతూ, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం డబ్బులుచెల్లించి రెండు సంవత్సరాలు గడిచినా నేటికి విద్యుత్ అధికారులు సర్వీసులు బిగించలేదని వారు వాపోయారు. గతంలో పనిచేసిన ఏఈలకు డబ్బులు కూడా చెల్లించామని తూతూమంత్రంగా ఒక్కొక్కరికి మూడు విద్యుత్ పోల్స్ ఇచ్చారని సర్వీస్‌గాని ట్రాన్స్‌ఫార్మర్‌గాని ఇవ్వలేదన్నారు. పంటలు సాగుచేసుకోవడానికి ప్రక్కనున్న రైతులు బోరుబావుల నుంచి సంవత్సరానికి రూ.15వేలు చెల్లించి నీటిని గంటలు చొప్పున విడిపించుకుంటున్నామన్నారు. విద్యుత్ శాఖ అధికారుల చుట్టూ రెండేళ్లుగా తిరిగినా నేటికీ ప్రయోజనం లేకపోయిందన్నారు. జిల్లా అధికారులు, తాలూకా ఏడీకి పిర్యాదు చేశామన్నారు. అయినా ఇంతవరకు చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఈ విషయాన్ని అగళి మండలం హెచ్‌డిహళ్లి గ్రామంలో రెవెన్యూ సదస్సులకు, పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్ వచ్చినప్పుడు కూడా పిర్యాదు చేశామన్నారు. దీనిపై మడకశిర ఇన్చార్జి ట్రాన్స్‌కో ఏడీ నాగన్న మాట్లాడుతూ రైతులు విద్యుత్ సర్వీసుల కోసం డబ్బులు చెల్లించినవారికి సీనియార్టీ ప్రకారం అందజేస్తామని తెలిపారు.

గ్రంథాలయాన్ని తనిఖీ చేసిన కార్యదర్శి



రికార్డులను పరిశీలిస్తున్న గ్రంథాలయ కార్యదర్శి రమ

మడకశిరటౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉమ్మడి జిల్లా గ్రంథాలయ కార్యదర్శి రమ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పాఠకులకు అనుగుణంగా పుస్తకాలు ఉన్నాయా? ఎలాంటి పుస్తకాలు లైబ్రరీకి అవసరం?అనేదానిపై ఇన్‌చార్జి గ్రంథాలయ అధికారి శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకొన్నారు. పాఠకులకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచాలని, గ్రంథాలయ నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా పాఠకులకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి

అమరాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనుల గుర్తింపు కోసం హలుకూరు, కె.శివరం గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద గురువారం గ్రామసభలను ఉపాధి హామీ ఏపీఓ జగదీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ మంజునాథ్, హెన్రీ అరుణ్‌కుమార్, సర్పంచులు గోవిందప్ప, మంజుళ చిక్కన్న, గ్రామ కార్యదర్శులు నాగమణి, జీవన్ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు గిరీష్‌కుమార్, మంజునాథ్, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. చదువుకొన్న యువతీ యువకులకు ఉన్నతి కార్యక్రమం ద్వారా డేస్ స్కాలర్‌షిప్ అందజేస్తామన్నారు.

పూలే ఆశయ సాధనకు కృషి : ఎమ్మెల్యే



పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జ్యోతిరావు పూలే ఆదర్శ ప్రాయుడని, ఆయన ఆశయ సాధన కోసం కృషి చేద్దామని ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యులు ఎం.ఎస్.రాజు అన్నారు. జ్యోతిరావుపూలే 134వ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం పట్టణంలోని అమరాపురం బస్టాండు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, జ్యోతిరావు పూలే బహుజనుల బ్రతుకుల్లో వెలుగులు నింపిన విప్లవ వీరుడని కొనియాడారు. పూలే 1848లో స్త్రీల విద్య కోసం మొదటి బాలికల పాఠశాల పూణేలో ఏర్పాటు చేశారన్నారు. అన్ని మతాలు అన్ని కులాలను కలిపి ఏకం చేయాలన్న ఉద్దేశంతో సత్యశోధక్ సమాజ్‌ని స్థాపించారన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి రాధాకృష్ణ, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, మీడియా కోఆర్డినేటర్ రవికుమార్, కౌన్సిలర్లు హాజరయ్యారు.

సమస్యలు పరిష్కరించకుంటే చర్యలు

నగర పంచాయతీ పరిధిలోని కాలనీల్లో నెల కొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపకపోతే చర్యలు తప్పవని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. పట్టణంలో గురువారం ఉదయం టీటైం కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని 8, 9 వార్డులలో కాలి నడకన పర్యటించి ప్రజల సమస్యలు నేరుగా అడిగి తెలుసుకొన్నారు. ప్రధానంగా కాలనీల్లో తాగునీరు సక్రమంగా రావడం లేదని, డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేదని, పరిశుభ్రత లేదని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో మున్సిపల్ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. సత్వరమే సమస్యలు పరిష్కరించకపోతే చర్యలు తప్పవన్నారు. ఈసందర్భంగా కౌన్సిలర్లు ఉమాశంకర్, హనుమంతు, యువత అధ్యక్షులు తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘన నివాళి



గ్రంథాలయ అధికారి బాషాను సన్మానిస్తున్న దృశ్యం

పెనుకొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జ్యోతిబాపూలే వర్ధంతి సందర్భంగా పెనుకొండలో ఘన నివాళి అర్పించారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాషా, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎంఎస్ మూర్తి, నంజుండ, ఇమ్రాన్, ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్దన్న, రామాంజినేయులు ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం ఉత్తమ గ్రంథాలయ అధికారిగా అవార్డు అందుకున్న మహబూబ్ బాషాను సత్కరించారు.

బహుజనుల ఆశాజ్యోతి



పూలేకు నివాళులర్పిస్తున్నయువత

హిందూపురం అర్బన్: బహుజనుల ఆశాజ్యోతి, జ్యోతిబాపూలే అని బీఎస్పీ నాయకులు పేర్కొన్నారు. గురువారం బీఎస్పీ కార్యాలయం వద్ద పూలే వర్ధంతిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరాములు పాల్గొన్నారు.

ఆశయాలను కొనసాగిస్తాం

మడకశిర రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మహాత్మాజ్యోతిరావు పూలే ఆశయాలను కొనసాగిస్తామని జిల్లేడగుంట పాఠశాల హెచ్‌ఎం భూతన్న తెలిపారు. పూలే వర్ధంతిని గురువారం పాఠశాలలో ఘనంగా జరుపుకున్నారు.